



# నేటి దర్శిని

WWW.NETIDARSHINI.COM

RNI NO: TGTEL/25/A0471

తెలుగు దిన పత్రిక

సత్య శోధనే మా లక్ష్యం...

రంగారెడ్డి బుధవారం 8-07-2026 సంపుటి: 02 సంచిక : 68 వెల: 2 రూ పేజీలు :08 సంపాదకులు: కట్ల హిమ పావని

Ranga Reddy Wednesday,8-07-2026 Volume :02 Issue: 68 RS: 2 Pages:08 Editor : Katta HimaPavani





## గురుకులాలు, హాస్టళ్లలో
# క్లీన్ అండ్ గ్రీన్



### మెనూ అమలులో రాజీ ఉండొద్దు

- బీసీ స్టడీ సర్కిల్స్ బలోపేతానికి ప్రత్యేక కమిటీ
- 16 నుంచి కులవృత్తుల మేళా.. అన్ని కులాలకు అవకాశం
- స్కిల్ డెవలప్‌మెంట్‌తో బీసీలకు మరిన్ని ఉపాధి అవకాశాలు
- ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై అధ్యయనం చేయాలి
- బీసీ సంక్షేమ శాఖలో సంక్షేమం, నాణ్యత, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత
- బీసీ సంక్షేమ శాఖ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్

గురుకులాలు, హాస్టళ్లు ప్రారంభమై 20 రోజులు పూర్తైన నేపథ్యంలో గత సమీక్షా సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై బీసీ సంక్షేమ శాఖకు సంబంధించిన కార్యక్రమాలపై సచివాలయంలో రవాణా మరియు బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గురుకులాలు, హాస్టళ్లు పరిశుభ్రంగా, పచ్చదనంతో కూడిన క్లీన్ అండ్ గ్రీన్ వాతావరణంలో ఉండేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్ణయించిన మెనూను అన్ని గురుకులాలు, హాస్టళ్లలో తప్పనిసరిగా అమలు చేయాలని సూచించారు. జిల్లా బీసీ సంక్షేమ -మిగతా 2 లో



## వీబీ గ్రామ్‌జీ రాష్ట్ర బడ్జెట్ రూ.6,311 కోట్లు

- ఈ ఏడాది లక్ష్యం 12 కోట్ల పనిదినాలు
- నేటి నుంచి సర్పంచ్‌లు, కార్యదర్శులకు 3 రోజులపాటు శిక్షణ
- పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క

హైదరాబాద్

వీబీ గ్రామ్ జీ పథకం కింద ఈ ఆర్థిక సంవత్సరానికి రూ.6,311 కోట్ల బడ్జెట్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదం తెలిపిందని పంచాయతీరాజ్ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క అన్నారు. గ్రామపంచాయతీ సమగ్ర అభివృద్ధి ప్రణాళిక, వీబీ గ్రామ్ జీ పథకం అమలు,16వ ఆర్థిక సంఘం నిధుల వినియోగం, తాగునీటి సరఫరా తదితర అంశాలపై జిల్లా అదనపు కలెక్టర్లు, ఇంజినీర్-ఇన్-చీఫ్‌లు, ఇతర పంచాయతీ రాజ్ అధికారులతో మంగళవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ జూలై నుంచి వచ్చే ఏడాది మార్చి వరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కోట్ల పని దినాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు. ప్రతి గ్రామపంచాయతీలో నెలకు కనీసం వెయ్యి పని దినాలు సృష్టించేలా కార్యాచరణ రూపొందించాలనీ, రాష్ట్రవ్యాప్తంగా ప్రతిరోజూ 5 లక్షల మంది కూలీలకు ఉపాధి కల్పించే దిశగా అధికారులు పనిచేయాలని ఆదేశించారు. పంచాయతీ రాజ్ శాఖలో -మిగతా 2 లో



## వయనాడ్‌లో బీభత్సం..

- కొండచరియలు విరిగిపడి ముగ్గురు మృతి..
- శిథిలాల కింద చిక్కుకున్న పలువురు
- ఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరం
- ఎన్‌డీఆర్‌ఎఫ్, రెస్క్యూ బృందాల గాలింపు
- మరోసారి కొండచరియల ప్రమాదంపై ఆందోళన

వయనాడ్

కేరళలోని వయనాడ్ జిల్లాలో దారుణ ప్రమాదం జరిగింది. టన్నెల్ వద్ద కొండ చరియలు విరిగిపడిన ఘటనలో ముగ్గురు మరణించారు. మట్టిదిబ్బల కింద మరికొందరు చిక్కుకున్నారు. ఈ ఘటన కేరళలోని వయనాడ్ జిల్లా, మెప్పాడి సమీపంలోని కల్లాడి వద్ద మంగళవారం జరిగింది. స్థానిక మీనాక్షి బ్రిడ్జి వద్ద ఒక టన్నెల్ కోసం తవ్వాలు, నిర్మాణం జరుగుతున్న ప్రదేశంలో కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో ఆ మట్టిదిబ్బలు, రాళ్ల కింద పలువురు చిక్కుకుపోయారు. వీరిలో ముగ్గురు మరణించారు. ఘటనపై సమాచారం అందుకున్న -మిగతా 2 లో



## పుంజుకున్న నైరుతి రుతుపవనాలు

- జూలై తొలి వారంలో 11 శాతం అధిక వర్షపాతం
- రానున్న రోజుల్లో విస్తారంగా వర్షాలు
- అల్పపీడనంతో పలుచోట్ల భారీ వర్షాలు
- ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు ఐఎండీ హెచ్చరిక

న్యూఢిల్లీ,

ఈ సంవత్సరం మందకొడిగా ప్రారంభమైన నైరుతి రుతు పవనాలు పుంజుకున్నాయి. జూలై మొదటి వారంలో దేశమంతటా మిగులు వర్షపాతం నమోదైంది. భారత వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా డాటా ప్రకారం.. సాధారణంగా జూలై 1 నుంచి జూలై 6 వరకు నమోదయ్యే 48 మి.మీకు బదులుగా 53.3 ఎంఎం వర్షపాతం రిక్షార్డైంది. ఇది 11 శాతం ఎక్కువని ఐఎండీ తెలిపింది.ఇస్రోకు చెందిన చిత్రాలు కూడా రుతు పవనాల పునరుజ్జీవనాన్ని సూచిస్తున్నాయి. అరేబియా సముద్రం నుంచి బంగాళాఖాతం వరకు, హిమాలయ పాద పర్వత ప్రాంతం వరకు క్రియాశీలక వాతావరణ వ్యవస్థల ప్రభావంతో ఉంది. దీని కారణంగా రానున్న రోజుల్లో విస్తృతంగా వర్షాలు పడుతాయని అంచనా వేస్తున్నారు. కాగా, బంగాళాఖాతంలోని అల్పపీడనం కదులుతున్నందున రానున్న 36 నుంచి 48 గంటల్లో ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తూర్పు మధ్యప్రదేశ్ ప్రాంతాల్లో అతి భారీ వర్షాలు కురువవచ్చును ఐఎండీ హెచ్చరించింది.



## మన బంధానికి పునాది రామాయణ, మహాభారతాలే

- ఇండోనేసియా పార్లమెంటులో మోదీ కీలక వ్యాఖ్యలు
- ఇండోనేసియా పార్లమెంటును ఉద్దేశించి ప్రధాని మోదీ కీలక ప్రసంగం
- రెండు దేశాల ప్రాచీన, సాంస్కృతిక, చారిత్రాత్మక బంధాల ప్రస్తావన
- సముద్రం విడదీయలేదు కలిపిందని వ్యాఖ్యలు

న్యూఢిల్లీ

ఇండోనేసియా పర్యటనలో ఉన్న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ- ఆ దేశ పార్లమెంటును ఉద్దేశించి చేసిన ప్రసంగంలో కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్ ఇండోనేసియా సంబంధాల చారిత్రక, సాంస్కృతిక, పుణ్యాత్మక ప్రాధాన్యాన్ని వివరించారు. రెండు దేశాల మధ్య బంధం సముద్రంతో కాకుండా వేల ఏళ్ల చరిత్ర, సంస్కృతి, ఆధ్యాత్మిక వారసత్వంతో ముడిపడి ఉందని ఆయన పేర్కొన్నారు. సముద్రం ఎప్పుడూ రెండు దేశాల్ని -మిగతా 2 లో

## కాళేశ్వరంపై ప్రభుత్వానికి
# దురుద్దేశం లేదు

### మరమ్మతులకు వెళ్తే... మొత్తం కూలే ప్రమాదం

- ప్రజాభవన్‌లో మంత్రి ఉత్తమ్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్
- ఎన్‌డీఎస్‌ఏ చెప్పినట్టే చేస్తాం
- ఎల్‌నినోకు కాళేశ్వరంను ముడిపెట్టి రాజకీయం చేస్తున్నారు
- కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం ఆయన లేఖ రాస్తే మేడిగడ్డపై ప్రత్యేక అసెంబ్లీ ఏర్పాటు చేస్తాం
- ప్రభుత్వాన్ని ఒప్పిస్తే మూడేండ్లు ఆయనకే కాంట్రాక్ట్ ఇస్తాం
- బీఆర్‌ఎస్ తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టండి
- ప్రజాప్రతినిధులకు సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్

ఎల్‌నినో పేరు చెప్పి కాళేశ్వరం ప్రాజెక్టుపై బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని ఎండగట్టి, తెలంగాణ ప్రజలకు వాస్తవాలు వివరించాలని ముఖ్య మంత్రి ఎనుములు రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సంబంధిత అధికారులు కాళేశ్వరంపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. అనంతరం సీఎం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టుపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదన్నారు. ప్రాజెక్టును సరిదిద్దే ప్రయత్నంలో పొరపాట్లు జరిగితే ఎనలేని నష్టం వాటిల్లుతుందని హెచ్చరిం చారు. దీనిపై కనీస అవగా హన లేకుండా బీఆర్ఎస్ నాయకులు కేటీఆర్, హరీశ్‌రావు అసత్యాలు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. 'కేసీఆర్ చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలకు శిక్ష పడకూడదు. రాష్ట్ర ప్రజలు కట్టిన పన్నులు గోదావరి పాలు కాకూడదు. మూడు బ్యారేజీలతో ఉపయోగముంటే... -మిగతా 2 లో






## బ్యాట్లెత్తిసిన భారత్..

- 125 రన్స్ తేడాతో అతి పెద్ద పరాజయం
- మూడో టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం

2




## కేసీఆర్ కుటుంబం వేల కోట్ల అవినీతి

- కాళేశ్వరం ప్రాజెక్టును "కూలేశ్వరం"గా మార్చింది
- ఈ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ కు మాట్లాడే నైతిక హక్కు లేదు
- సాంకేతిక పరీక్షల అనంతరమే పునరుద్ధరణ పనులు
- టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

హైదరాబాద్-

కాళేశ్వరం ప్రాజెక్టు అంశంపై బీఆర్ఎస్ నేతలు ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ తీవ్ర విమర్శలు గుప్పించారు. కాళేశ్వరం పేరుతో కేసీఆర్ కుటుంబం వేల కోట్ల రూపాయల అవినీతికి పాల్పడిందని, ఇంజినీర్ల సూచనలను పక్కనబెట్టి కేసీఆర్ ఏకపక్ష నిర్ణయాలతో వ్యవహరించడం వల్లే కాళేశ్వరం ప్రాజెక్టు "కూలేశ్వరం"గా మారిందని ఆరోపించారు. కాళేశ్వరం పేరుతో జరిగిన అక్రమాలు రాష్ట్ర ప్రజలకు తెలిసిందేనని ఆయన అన్నారు. తానే ఇంజినీర్నంటూ కేసీఆర్ వ్యవహరించడం వల్ల ప్రాజెక్టు నాణ్యత దెబ్బతిందని, ఇప్పుడు కేటీఆర్ కూడా అదే అహంభావంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. వారం రోజుల్లో కాళేశ్వరం ద్వారా నీళ్లు ఇస్తామని చెబుతున్న కేటీఆర్, బీఆర్ఎస్ అధికారంలో ఉన్న తొమ్మిదిన్నరేళ్లలో -మిగతా 2 లో





2

## మీ సీఎం ఏం చేయాలో సుప్రీంకోర్టు చెప్పాలా'..

- తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకేపై సుప్రీంకోర్టు ఫైర్
- రాజకీయ విభేదాలకు కోర్టును వేదిక చేయొద్దని హితవు
- సీఎం పర్యటనలపై ఆంక్షల వాదనను తప్పుబట్టిన ధర్మాసనం
- పిటిషన్‌ను ఉపసంహరించుకున్న డీఎంకే
- కరూర్ తొక్కిసలాట కేసులో కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు

## ఒప్పందం కుదరాలి-లేదంటే యుద్ధమే

- ఇరాన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు
- చర్చలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యలు
- అవసరమైతే గంటల వ్యవధిలో కీలక సైనిక వసతులను ధ్వంసం చేయగలమని హెచ్చరిక

2

ఒప్పందం చేసుకోండి... లేకపోతే యుద్ధమే!" అంటూ ఇరాన్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి తీవ్ర హెచ్చరిక జారీ చేశారు. చర్చలకు తాము సిద్ధమేనని స్పష్టం చేస్తూనే, అవసరమైతే గంటల వ్యవధిలోనే ఇరాన్ కీలక సైనిక, అణు స్థావరాలను ధ్వంసం చేసే సామర్థ్యం అమెరికాకు ఉందని ప్రకటించగా... ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండిస్తూ ప్రతిస్పందించింది.



# మన బంధానికి పునాది రామాయణ, మహాభారతాలే

మొదటి తరువాయి

విడదీయలేదని, అది ఎప్పటికీ రెండు దేశాల అనుబంధానికి వారధిగా నిలిచిందని చెప్పారు. ఇండోనేసియా పార్లమెంట్ సభ్యుల్ని ఉద్దేశించి మాట్లాడిన మోదీ- ప్రబోవో సుబియాంటోతో జరిగిన చర్చలు ఇరు దేశాల సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తాయని చెప్పారు. 2018లోనే ప్రారంభమైన ఈ భాగస్వామ్యం ఇప్పుడు అభివృద్ధి, భద్రత, సాంకేతికత, విద్య, సంస్కృతి వంటి ఎన్నో రంగాలకు విస్తరించిందన్నారు. ఈ సందర్భంగానే రామాయణం, మహాభారతం రెండు దేశాల బంధానికి పునాది అని వ్యాఖ్యానించారు మోదీ. 'భారత్- ఇండోనేసియాను కేవలం సముద్రం మాత్రమే కలపలేదు. మనకు ఉమ్మడి చరిత్ర ఉంది. రామాయణం, మహాభారతం, నలందా విజ్ఞాన సంపద మన బంధానికి పునాది. వయాంగ్ కళారూపం, నృత్యం, సంగీతం, బోరోబుదూర్, ప్రంబనన్ వంటి అద్భుత కట్టడాలు మన సాంస్కృతిక అనుబంధానికి నిదర్శనం. ఇండోనేసియా జాతీయ చిహ్నమైన గరుడ, బాలి యాత్రా ఉత్సవం కూడా మన మధ్య ఉన్న బంధాన్ని గుర్తు చేస్తాయి' అని మోదీ పేర్కొన్నారు.

క్రుపుక్, పాపడ్- ఏది క్రిస్పీగా ఉంటుంది?

మోదీ ప్రసంగంలో ఆహార సంస్కృతి గురించి కూడా ప్రస్తావించారు. 'ఇండోనేసియా క్రుపుక్ లేదా మన పాపడ్ (అప్పడం) ఏది ఎక్కువగా కరకరలాడుతుంది (క్రిస్పీ) అంటే చెప్పడం కష్టం. కానీ మసాలాలు, బుంబు (సుగంధ ద్రవ్యాలు) మాత్రం రెండు దేశాల జీవితాల్లో అంతర్భాగంగా మారిపోయాయి' అని వ్యాఖ్యానించారు. భారత రాజధాని, ఇండోనేసియా రాజధాని మధ్య వేల కిలోమీటర్ల దూరం ఉన్నప్పటికీ సముద్ర మార్గంలో కేవలం 150 కిలోమీటర్ల దూరమే ఉందని మోదీ గుర్తు చేశారు. చాలా దేశాలకు సముద్రమే సరిహద్దు అని, కానీ భారత్- ఇండోనేసియా మధ్య సముద్రం ఎప్పుడూ విభజనకు చిహ్నం కాదన్నారు. అదే మనల్ని కలిపే వంతెన అని, అదే మన భవిష్యత్తుకు కేంద్ర బిందువు అన్నారు ప్రధాని.

'ఇరు దేశాల బంధాన్ని కొత్త శిఖరాలకు చేరుద్దాం'

'ఇండియా, ఇండోనేసియా.. ఇండియన్ ఓషియన్ (హిందూ మహాసముద్రం)- ఈ పేర్లే మన మధ్య ఉన్న గాఢమైన చారిత్రక బంధానికి సాక్ష్యం. వేల సంవత్సరాలుగా మన నౌకాశ్రయాలు ప్రపంచాన్ని అనుసంధానించాయి. మన నౌకలు వాణిజ్యంతో పాటు సంస్కృతిని కూడా ప్రపంచ నలుమూలలకు చేర్చాయి. సముద్ర సంబంధాల ద్వారా భవిష్యత్తులో అపార అవకాశాలు ఉన్నాయి. ఈ విశాలమైన మహాసముద్రాన్ని స్ఫూర్తిని తీసుకొని భారత్- ఇండోనేసియా సంబంధాల్ని కొత్త శిఖరాలకు తీసుకెళ్దాం' అని పిలుపునిచ్చారు. ఇక భారత్ ఎప్పుడూ విస్తరణ వాదాన్ని అనుసరించలేదని, అభివృద్ధినే లక్ష్యంగా పెట్టుకుందని ప్రధాని స్పష్టం చేశారు. 'సబ్ కా సాథ్, సబ్ కా వికాస్' అనే సిద్ధాంతంతో అందరి భాగస్వామ్యంతో అందరి అభివృద్ధి 'భారత్ లక్ష్యం' అనే సందేశంతో నేను మీ ముందుకు వచ్చాను" అని మోదీ పేర్కొన్నారు. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో శాంతి, స్థిరత్వానికి ఆసియాన్ (ఆసియాన్) కీలక పాత్రకు భారత్ ఎప్పుడూ ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మోదీ స్పష్టం చేశారు.

# బ్యాటెత్తేసిన భారత్..

**125 రన్స్ తేడాతో అతి పెద్ద పరాజయం**

**మూడో టీ20లో ఇంగ్లండ్ ఘన విజయం**



నాటింగ్‌హమ్

టీ20 వరల్డ్‌కప్ నెగ్గిన తర్వాత కొత్త కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ నాయకత్వంలో భారత్ చెత్తాటతో నిరాశపరుస్తోంది. ఐర్లాండ్ చేతిలో వైట్‌వాష్ అయిన తర్వాత ఇంగ్లండ్ గడ్డపై అడుగుపెట్టిన అయ్యర్‌సేన వరుసగా రెండో ఓటమి ఖాతాలో వేసుకుంది. గత పోరులో బౌలింగ్‌లో ఫెయిలైన భారత్ ఈసారి పేలవ బ్యాటింగ్‌తో అతి పెద్ద పరాజయంతో తలదించుకుంది. మంగళవారం రాత్రి జరిగిన మూడో టీ20లో 125రన్స్ తేడాతో ఓడింది. షార్ట్ ఫార్మాట్‌లో పరుగుల పరంగా భారత్‌కు ఇదే అతి పెద్ద ఓటమి. 2019లో వెల్లింగ్టన్‌లో న్యూజిలాండ్ చేతిలో 80 రన్స్ తేడాతో ఓడిన మెన్ ఇన్ బ్లూ ఇప్పుడు మరింత చెత్త రికార్డు ఖాతాలో వేసుకుంది.ఇంగ్లండ్ ఇచ్చిన 202 పరుగుల లక్ష్య ఛేదనలో టీమిండియా 11.4 ఓవర్లలో 76 రన్స్‌కే కుప్పకూలింది. జోష్ టంగ్ (4/28), జోఫ్రా ఆర్చర్ (3/29) పేస్ ధాటికి టాప్, మిడిలార్డర్ కుదేలైంది. ఓపెనర్లు అభిషేక్ (10), సూర్యవంశీ (13)తో పాటు ఇషాన్ (13), కెప్టెన్ అయ్యర్ (5), అక్షర్ (10), తిలక్ (3), శివం దూబే (2) పెవిలియన్‌కు క్యూకట్టడంతో జట్టుకు ఘోర పరాభవంతప్పలేదు. తొలుత టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లిష్ టీమ్ 20 ఓవర్లకు 201/7 స్కోరు చేసింది. ఓపెనర్ ఫిల్ సాల్ట్ (44 బంతుల్లో 7 ఫోర్లు, 3 సిక్సర్లతో 70), ఆల్‌రౌండర్ సామ్ కరన్ (41 నాటౌట్), జోస్ బట్లర్ (36) మెరుపులు మెరిపించారు. భారత బౌలర్లలో ప్రిన్స్, హర్షిత్ చెరో రెండు వికెట్లు తీశారు. ఈ విజయంతో ఐదు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇంగ్లండ్ 2-0తో ఆధిక్యంలో నిలిచింది. ఇరు జట్ల మధ్య నాలుగో టీ20 గురువారం జరుగుతుంది.

# కేసీఆర్ కుటుంబం వేల కోట్ల అవినీతి

మొదటి తరువాయి

ఏమి చేశారో ప్రజలకు చెప్పాలని డిమాండ్ చేశారు.

వరదలొచ్చే పరిస్థితుల్లో సముద్రంలోకి నీటిని వదులుతున్నారంటూ కేటీఆర్ చేస్తున్న వ్యాఖ్యలు ఆయన అనుభవరాహిత్యానికి నిదర్శనమని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అవినీతితో ప్రాజెక్టును ప్రమాదంలోకి నెట్టిందని, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాధనాన్ని, ప్రజల ప్రాణాలను కాపాడే దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునాదుల నాణ్యతపై తీవ్ర అనుమానాలు ఉన్నాయని, వాటిలో లోపాలను గుర్తించిన తర్వాత కూడా పంపులు ఆన్ చేయాలని కోరడం బాధ్యతారాహిత్యమని అన్నారు. సంబంధిత సాంకేతిక సంస్థల అనుమతులు లేకుండా బ్యారేజీలను నిర్వహించడం ప్రజల ప్రాణాలతో చెలగాటమాడటమేనని హెచ్చరించారు. ఎన్డీఎస్ఏ బ్యారేజీల పునాదులు, పైపింగ్ వ్యవస్థలో లోపాలను గుర్తించిందని, వాటిని పూర్తిగా సరిచేయకుండా నీటిని నిల్వ చేయడం అశాస్త్రీయమే కాక ప్రమాదకరమని పేర్కొన్నారు. త్వరలో సాంకేతిక పరీక్షల అనంతరం కాళేశ్వరం ప్రాజెక్టు పునరుద్ధరణ పనులను కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతుందని తెలిపారు. ప్రజల నీటి సెంటిమెంటును అడ్డం పెట్టుకుని అశాస్త్రీయంగా ప్రాజెక్టు నిర్మించి, అది ఉపయోగపడకుండా చేసిన బాధ్యత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని మహేష్ కుమార్ గౌడ్ ఆరోపించారు. తొమ్మిదిన్నరేళ్ల పాలనలో జరిగిన అక్రమాలపై కేటీఆర్ ముందుగా పశ్చాత్తాపం వ్యక్తంచేయాలని, లేకపోతే ప్రజలు బీఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

# వయనాడ్‌లో బీభత్సం..

మొదటి తరువాయి

ఫైర్, రెస్క్యూ బృందాలు యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు ప్రారంభించాయి. శిథిలాల కింద చిక్కుకున్న వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఈ ఘటనపై కేరళ సీఎం వీడీ సతీషన్ కూడా స్పందించారు. వయనాడ్ జిల్లా అధికారులతో మాట్లాడారు. తక్షణమే సహాయక చర్యలు ప్రారంభించి బాధితుల్ని కాపాడాలని, వ్యవస్థల్ని సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. సహాయక చర్యల్ని పర్యవేక్షించాల్సిందిగా మంత్రులు ఏపీ అనిల్ కుమార్, టీ సిద్దిఖ్‌లను ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా ఇక్కడ టన్నెల్ నిర్మాణ పనుల్ని సోమవారం నుంచే నిలిపివేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో గడిచిన 24 గంటల్లో 265 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. భారీ వర్షాల కారణంగానే ఈ కొండచరియలు విరిగిపడి ఉంటాయని అధికారులు భావిస్తున్నారు. ఘటనా స్థలం వద్ద ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. రెస్క్యూ ఆపరేషన్స్ రాకముందే స్థానికులు సహాయక చర్యల్లో పాల్గొన్నారు ఆరుగురిని రక్షించారు. ఈ ఘటనలో ముగ్గురు మరణించగా, మిగిలిన వారి కోసం సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మరోవైపు ఈ ప్రాంతంలో కొండచరియలు విరిగిపడటం వల్ల పలు వాహనాలు కూడా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలు, కొండచరియలు విరిగిపడటం వల్ల స్తానికంగా నివసించే వారి భద్రత విషయంలో అనుమానాలు తలెత్తుతున్నాయి. ఇండ్లకు ప్రమాదం ఏర్పడే అవకాశం ఉందని స్థానికులు భావిస్తున్నారు. పోలీసులతోపాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సహాయక చర్యల్లో పాళ?గ్గంటున్నాయి.

# కాళేశ్వరంపై ప్రభుత్వానికి దురుద్దేశం లేదు

మొదటి తరువాయి



రాత్రింబవళ్లు అక్కడే ఉండి పూర్తి చేసేవాళ్లం. నిజంగా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో అసహనంగా ఉన్నాం...' అని సీఎం వివరణ ఇచ్చారు. కాళేశ్వరంపై చేసిన రూ.97 వేల కోట్ల అప్పులో ఇప్పటి వరకు 33,574.11 కోట్లు తిరిగి చెల్లించామని చెప్పారు. 30 నెలల్లో తమ ప్రభుత్వం 1.80 లక్ష?ల కోట్లు అప్పుచేయగా, రూ.2.08లక్ష?ల కోట్లను తిరిగి చెల్లించామన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వారి హయాంలో చేసిన రూ.8లక్ష?ల కోట్ల అప్పును వారసత్వంగా ప్రజా ప్రభుత్వానికి అప్పగించిందని గుర్తుచేశారు. అయినా వారు ప్రవేశపెట్టిన ఏ ఒక్క పథకాన్ని ఆపలేదన్నారు. షాదిముబారక్, కళ్యాణలక్ష్మి, రైతు భరోసాతో పాటు పేదలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500 గ్యాస్ మొదలగు కొత్త పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు.

కమీషన్ల కోసమే రీ డిజైనింగ్

వైఎస్ రాజశేఖర్‌రెడ్డి సీఎంగా ఉన్నప్పుడు రూ.38 వేల కోట్లతో ప్రతిపాదించిన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టును కమీషన్ల కోసమే కేసీఆర్ రీ డిజైన్ చేసి రూ.81 వేల కోట్లకు పెంచారని ఆరోపించారు. ఆ తర్వాత ప్రాజెక్టు అంచనా రూ.1.47 లక్షల కోట్లకు పెరిగిందంటూ 'కాగ్' నివేదిక ఇచ్చిందని గుర్తు చేశారు. దీనిపై ఏర్పాటు చేసిన రిటైర్డ్ ఇంజినీర్ల కమిటీ మేడిగడ్డ బ్యారేజ్ నిర్మించినా నిలబడదంటూ నివేదికనిచ్చిందని గుర్తు చేశారు. ఆ నివేదికను తుంగలో తొక్కి వాప్కోస్ ద్వారా తనకు అనుకూలంగా నివేదిక ఇప్పించుకున్నారని విమర్శించారు. "కాళేశ్వరం ప్రాజెక్టు తన బ్రెయిన్ చైల్డ్ అని కేసీఆర్ చెప్పారు. ప్రారంభించిన ఏడాదిలోనే నిర్మాణ లోపాలు బయటపడ్డాయి. మేడిగడ్డ వద్ద సీసీ బ్లాకులను సరి చేయాలని ఈఈ రమణారెడ్డి 2020లో రాసిన లేఖను పట్టించుకోలేదన్నారు. ప్రాజెక్టు నిర్మాణ సంస్థ మరమ్మతులు చేపట్టలేదని చెప్పారు. గోదావరి వరదకు 2022లో కన్నెపల్లి పంపుహౌస్‌లు మునిగాయి. పట్టించుకోకపోవడం వల్ల 2023లో కాళేశ్వరం పిల్లర్లు కూలాయి. బ్యారేజీల నిర్మాణానికి ముందు భూ పరీక్షలు చేయలేదు. ఇసుకమేటలపై నిర్మించడం వల్ల నిల్వ చేసిన నీటి ఒత్తిడికి బ్యారేజీ కుంగింది. నాలుగు పిల్లర్లు కుంగిపోతే ఏమవుతుందని కేసీఆర్ అంటున్నారు. గోదావరి జలాల ఎత్తిపోతలకు మేడిగడ్డ బ్యారేజీ వెన్నుపూస లాంటింది.వెన్నుపూస దెబ్బతింటే చేసేదేమీ లేదు.. నీళ్లు అలా వస్తే.. ఇలా పోతాయి. 80 వేల పుస్తకాలు చదివిన మేధావి మూడేండ్లలో కట్టిన కాళేశ్వరం కూలింది. వారం రోజులపాటు తమకు ప్రాజెక్టును అప్పగిస్తే నీరు నింపుతానని అంటున్నారు. మిడిమిడి జ్ఞానం ఉన్నవారిని పంపితే ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. నాణ్యత లోపం వల్ల కాళేశ్వరం కూలిందని ఎన్డీఎస్ఏ చెప్పింది. ఎవరెన్ని విమర్శలు చేసినా మేం మాత్రం గతంలో జరిగిన తప్పిదాలు చేయకుండా నిపుణుల సలహా మేరకే ముందుకెళ్తాం...' అని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఎల్‌నినో పేరు చెప్పి ఉత్తర తెలంగాణ ప్రజలను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తున్నదని సీఎం విమర్శించారు. ఎల్‌నినో వల్ల వర్షాలే రాకపోతే.. వరదలు ఎలా వస్తాయని ప్రశ్నించారు. ఉద్యమం పేరుతో ప్రజలను మభ్యపెట్టి బీఆర్ఎస్ నేతలు అధికారంలోకి వచ్చారని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ముందున్న కోదండరామ్, ప్రొఫెసర్ యాదగిరి వంటి వారిని దగ్గరకు రానివ్వలేదని గుర్తు చేశారు. 'తాటిచెట్టులా పెరిగితే సరిపోదు.. తలకాయలో గుజ్జు ఉండాలి. నీటిని ఎలా ఒడిసిపట్టాలో తెలియని వారు నీతులు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే ఈ ప్రాజెక్టును నిర్మించారు. కేసీఆర్‌ది ఆర్థిక ఉగ్రవాద కుటుంబం. ?నీరు నింపడం సాధ్యం కాదని మంత్రి ఉత్తమ్ తెలిపారు.

# మీ సీఎం ఏం చేయాలో సుప్రీంకోర్టు చెప్పాలా'.

**-తమిళనాడులో ప్రతిపక్ష డీఎంకేపై సుప్రీంకోర్టు ఫైర్**
**-రాజకీయ విభేదాలకు కోర్టును వేదిక చేయొద్దని హితవు**
**-సీఎం పర్యటనలపై ఆంక్షల వాదనను తప్పుబట్టిన ధర్మాసనం**
**-పిటిషన్‌ను ఉపసంహరించుకున్న డీఎంకే**
**-కరూర్ తొక్కిసలాట కేసులో కొనసాగుతున్న సీబీఐ దర్యాప్తు**



న్యూఢిల్లీ

తమిళనాడు లో ప్రతిపక్ష పార్టీ డీఎంకే పై సుప్రీంకోర్టు తీవ్ర అసహనం వ్యక్తంచేసింది. ముఖ్యమంత్రి విజయ్ పర్యటనలు, ప్రసంగాలపై ఆంక్షలు విధించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌ను విచారించిన ధర్మాసనం.. రాజకీయ విభేదాలను పరిష్కరించుకోవడానికి సుప్రీంకోర్టును వేదికగా మార్చవద్దని స్పష్టంచేసింది. ఈ వ్యాఖ్యలతో డీఎంకే వెనక్కి తగ్గి తన పిటిషన్‌ను ఉపసంహరించుకుంది.కరూర్ తొక్కిసలాట కేసులో సీబీఐ దర్యాప్తు కొనసాగుతున్న సమయంలో ముఖ్యమంత్రి విజయ్ జూలై 10న అక్కడ పర్యటించనున్నారని డీఎంకే కోర్టు దృష్టికి తీసుకొచ్చింది. మృతుల కుటుంబాలకు ఉద్యోగ నియామక పత్రాలు, ఆర్థిక సాయం అందించే కార్యక్రమం దర్యాప్తులో ఉన్న సాక్షులపై ప్రభావం చూపే అవకాశం ఉందని వాదించింది. అంతేకాదు టీవీకే నేత ఆదవ్ అర్జున చేసిన వ్యాఖ్యలపైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. ఈ నేపథ్యంలో ముఖ్యమంత్రి ప్రసంగాలు, పర్యటనలపై ఆదేశాలు ఇవ్వాలని కోరింది. అయితే ఈ వాదనలను సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పుబట్టింది. 'ముఖ్యమంత్రి ఏం చేయాలో కూడా సుప్రీంకోర్టే చెప్పాలా..? ఆయన ఈ కేసులో నిందితుడు కాదు. స్వేచ్ఛగా మాట్లాడే హక్కుపైనా ఆంక్షలు కోరుతున్నారా..? రాజకీయ ప్రత్యర్థుల వ్యాఖ్యలపై ఈ కోర్టు ఎలా ఆదేశాలు ఇస్తుంది..?' అంటూ ధర్మాసనం ప్రశ్నించింది. దాంతో డీఎంకే తన పిటిషన్‌ను వెనక్కి తీసుకునేందుకు అనుమతి కోరగా కోర్టు అంగీకరించింది. కాగా గత ఏడాది సెప్టెంబర్‌లో కరూర్‌లో విజయ్ ఎన్నికల ప్రచార సభ సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో 41 మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటనపై సీబీఐ దర్యాప్తు కొనసాగుతోంది. తొక్కిసలాటకు టీవీకే కార్యకర్తల నిర్లక్ష్యమే కారణమని డీఎంకే ఆరోపిస్తుండగా, ఇదంతా డీఎంకే రాజకీయ కుట్రేనని విజయ్, టీవీకే నేతలు ఆరోపిస్తున్నారు.

# ఒప్పందం కుదరాలి- లేదంటే యుద్ధమే

**-ఇరాన్‌పై ట్రంప్ కీలక వ్యాఖ్యలు**
**-చర్చలకే తొలి ప్రాధాన్యం ఇస్తున్నామని ట్రంప్ వ్యాఖ్యలు**
**-అవసరమైతే గంటల వ్యవధిలో కీలక మౌలిక వసతులను ధ్వంసం చేయగలమని హెచ్చరిక**




న్యూఢిల్లీ

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో తమకు రెండు మార్గాలే ఉన్నాయని, ఒకటి పరస్పర ఒప్పందానికి రావడం, లేదంటే తమ లక్ష్యాన్ని పూర్తి చేయడమేనని స్పష్టం చేశారు. తాము తలచుకుంటే ఇరాన్ కీలక మౌలిక సదుపాయాలను దెబ్బతీసే సామర్థ్యం అమెరికాకు ఉందని అన్నారు. అయితే సైనిక చర్యల కంటే చర్చల ద్వారానే సమస్యకు పరిష్కారం లభించాలని తాను కోరుకుంటున్నానని వెల్లడించారు. మీడియాతో మాట్లాడుతూ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు.

'మేం ఏదోక విధంగా గెలుస్తాం. ఇరాన్‌తో ఒప్పందం కుదుర్చుకుంటాం లేదా మా పనిని పూర్తిచేస్తాం. సైనిక చర్యల వల్ల కోట్లాది మంది ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో చర్చలకే ప్రాధాన్యం ఇస్తున్నాం. సుమారు 9.1 కోట్ల మంది ప్రజలపై ప్రభావం పడాలని నేను కోరుకోవడం లేదు. అందుకే ఒక ఒప్పందం చేసుకోవడానికే ఇష్టపడ్డా. మనం గంట వ్యవధిలోనే వారి వంతెనలను కూల్చేయగలం. విద్యుత్ సరఫరా వ్యవస్థను పూర్తిగా నిలిపివేయగలం. వారు నిర్మించిన భారీ ఆధునిక విద్యుత్ కేంద్రాలన్నింటినీ కొన్ని గంటల్లోనే నిర్వీర్యం చేయగలం. ప్రతీ ప్లాంట్ మాయమైపోతుంది. ఆ విషయం ఋతీఅవనెఅ కూడా తెలుసు' అని ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ ఒకప్పుడు ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ప్రస్తుతం ఆ పరిస్థితి లేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. అమెరికా నుంచి తమకు ఎలాంటి ఆర్థిక సహాయం అందలేదని కూడా ఆయన స్పష్టం చేశారు.

గతంలో ఇరాన్ నాయకత్వంపై వ్యాఖ్యలు ఇటీవల కూడా ఇరాన్ నాయకత్వంపై ట్రంప్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు పలువురు కీలక నాయకులు ఒకేచోట చేరిన విషయాన్ని ప్రస్తావించారు. తాము కోరుకుంటే ఒకే దాడిలో వారందరినీ లక్ష్యంగా చేసుకునే సామర్థ్యం అమెరికాకు ఉందని చెప్పారు. అయితే అలాంటి చర్యకు దిగలేదని, ఎందుకంటే చర్చలు జరిపేందుకు నాయకత్వం అవసరమని పేర్కొన్నారు. సైనిక శక్తి ఉన్నప్పటికీ దౌత్యపరమైన చర్చల ద్వారానే సమస్యను పరిష్కరించాలని అమెరికా భావిస్తోందని ఆయన సంకేతాలు ఇచ్చారు.

ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం ట్రంప్ వ్యాఖ్యలను ఇరాన్ తీవ్రంగా ఖండించింది. ఆర్మేనియాలోని ఇరాన్ రాయబార కార్యాలయం సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ అమెరికాపై తీవ్ర విమర్శలు చేసింది. ఖమేనీ మరణంతో ఇరాన్ ప్రజలు అనుభవిస్తున్న బాధను అమెరికా ఎప్పటికీ అర్థం చేసుకోలేదని పేర్కొంది. అమెరికాకు నాగరికత, చరిత్ర, గౌరవం లేదని తెలిపింది. వ్యక్తులను చంపవచ్చు కానీ వారి ఆశయాలను కాదని పేర్కొంది. ఖమేనీని హతమార్చినప్పటికీ ఆయన ఆలోచనాలను అంతమొందించలేరని చెప్పింది. సెంట్ సీసాను పగలగొట్టవచ్చు కానీ దాని పరిమళాన్ని ఆపలేరని ఇరాన్ రాయబార కార్యాలయం తన ప్రకటనలో పేర్కొంది. ఖమేనీ అంతిమయాత్ర ఇదిలా ఉండగా, ఆయతుల్లా అలీ ఖమేనీ భౌతికకాయాన్ని ఇరాన్‌లోని ఖోమ్ నగరానికి తరలించారు. ప్రభుత్వ టెలివిజన్ ప్రసారం చేసిన దృశ్యాల ప్రకారం హెలికాప్టర్ ద్వారా జమ్‌కరాన్ మసీదుకు ఆయన మృతదేహాన్ని తీసుకువచ్చారు. అంతిమయాత్ర మంగళవారం ఖోమ్‌లో కొనసాగనుండగా, అనంతరం ఇరాక్‌లోని పవిత్ర నగరాలైన నజఫ్, కర్బలా ప్రాంతాలకు తరలించనున్నారు. తర్వాత గురువారం ఇరాన్‌లోని మషద్ నగరంలో అలీ ఖమేనీ భౌతికకాయాన్ని ఖననం చేయనున్నారు. కాగా, ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన వైమానిక దాడిలో అలీ ఖమేనీ చనిపోయారు. అనంతరం సుదీర్ఘ కాలం పాటు పశ్చిమాసియాలో యుద్ధం కొనసాగడం వల్ల ఖమేనీ అంత్యక్రియలు చాలా కాలం ఆలస్యం అయ్యాయి. అయితే, ఖమేనీ అంత్యక్రియల్లో ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ పాల్గొనలేదు. మొజ్తబా ఖమేనీని హత్యా చేస్తామని ఇజ్రాయెల్ బెదిరిస్తున్న నేపథ్యంలో భద్రతాపరమైన కారణాలతో తన తండ్రి అంత్యక్రియలకు మొజ్తబా హాజరుకాలేదు.

# వీబీ గ్రామ్‌జీ రాష్ట్ర బడ్జెట్ రూ.6,311 కోట్లు

మొదటి తరువాయి

నూతన విధానాలు, మార్గదర్శకాలపై సర్పంచులు, కార్యదర్శులు, ఇంజినీర్లు, సంబంధిత శాఖల అధికారులకు జులై 8 నుంచి 10 వరకు మూడు రోజుల శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే రాష్ట్రస్థాయిలో మాస్టర్ రిసోర్స్ పర్సన్ల శిక్షణ పూర్తయిందనీ, అదే తరహాలో జిల్లాల్లో సర్పంచ్‌లు, కార్యదర్శులుకు శిక్షణలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

శిక్షణను గైర్హాజరయ్యే వారిపై శాఖాపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. 16వ ఆర్థిక సంఘం నిధులను కేంద్ర మార్గదర్శకాల ప్రకారమే ఖర్చు చేయాలని మంత్రి స్పష్టం చేశారు. గ్రామాల్లో తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం, అంతర్గత రహదారులు, డ్రైనేజీ, పచ్చదనం, ప్రజా మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన వంటి అంశాల్లో లక్ష్య సాధన దిశగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. ఇప్పటికే ఆమోదం పొందిన గ్రామపంచాయతీ, మహిళా, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలను గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎల్-నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని నీటి సంరక్షణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ప్రతి ఇంటికి ఇంకుడు గుంత, ప్రతి పొలానికి పంటకుంట, ప్రతి గ్రామానికి ఊటకుంటతో పాటు బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. అలాగే రాష్ట్రవ్యాప్తంగా 1,000 కొత్త వ్యవసాయ బావుల తవ్వకానికి కార్యాచరణ సిద్ధం చేయాలని సూచించారు. గ్రామపంచాయతీలు స్వయం సమృద్ధిగా ఎదగాలంటే స్వంత ఆదాయ వనరుల పెంపుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పంచాయతీరాజ్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిశోర్, కమిషనర్ దివ్య దేవరాజన్, ప్రత్యేక కమిషనర్ శ్రీలక్ష్మి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# గురుకులాలు, హాస్టళ్లలో క్లీన్ అండ్ గ్రీన్

మొదటి తరువాయి

అధికారులు (డీబీసీడబ్ల్యూఓలు) క్రమశిక్షణతో విధులు నిర్వహిస్తూ విద్యార్థుల సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు తరచూ గురుకులాలు, హాస్టళ్లను సందర్శించి విద్యార్థుల పరిస్థితులను స్వయంగా పరిశీలించాలని సూచించారు. స్టడీ సర్కిల్స్‌లో మరింత నాణ్యత పెంపొందించేందుకు, సివిల్స్‌తో పాటు వృత్తి శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసేందుకు ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లో విజయవంతంగా అమలవుతున్న స్టడీ సర్కిల్స్ విధానాలను అధ్యయనం చేసి రాష్ట్రంలో అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. జులై 16 నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న కులవృత్తుల మేళాలో అన్ని కులాల సాంప్రదాయ వృత్తిదారులకు సమాన అవకాశాలు కల్పించాలని సూచించారు. మహిళల ఆర్థిక స్వావలంబనకు తోడ్పడే కుట్టు మిషన్ పథకం అమలు కోసం సమగ్ర విధి విధానాలను రూపొందించాలని ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలను మరింత విస్తృతంగా చేపట్టి ఉపాధి అవకాశాలను పెంచాలని, ఎకనామిక్ సపోర్ట్ స్కీమ్స్‌పై సమగ్ర అధ్యయనం చేసి అమలుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించిన గురుకుల విద్యార్థులకు అందించే ల్యాప్‌టాప్‌ల పంపిణీపై సమగ్ర నివేదిక సమర్పించాలని మంత్రి ఆదేశించారు. బీసీ సంక్షేమ శాఖ కమిషనర్, గురుకులాల కార్యదర్శి ఆకస్మికంగా గురుకులాలు, హాస్టళ్లను తనిఖీ చేస్తూ విద్యార్థులకు నాణ్యమైన సౌకర్యాలు అందుతున్నాయో లేదో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కాటమయ్య రక్షణ కవచాల శిక్షణ పూర్తి చేసుకొని కిట్లు అందని జిల్లాల్లో వెంటనే పంపిణీ పూర్తి చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి బాలమాయాదేవి, గురుకులాల కార్యదర్శి సైదులు, బీసీ సంక్షేమ శాఖ అధికారులు మల్లయ్య బట్టు, ఆలోక్ కుమార్, మామిడి హరికృష్ణ, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.






# మహబూబ్ నగర్ జిల్లా సైబర్ వారియర్స్‌కు సైబర్ నేరాల నియంత్రణపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం

**మిడ్జిల్, జులై 07, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో ):**
మహబూబ్ నగర్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్‌లో మంగళవారం జిల్లాలోని సైబర్ వారియర్స్‌కు ప్రత్యక్షంగా, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు మరియు సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ (VC) ద్వారా సైబర్ నేరాల నివారణ, దర్యాప్తు మరియు చీజ్రా పెండింగ్ ఫిర్యాదుల సత్వర పరిష్కారంపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం సైబర్ క్రైమ్ డీస్పీ గిరి కుమార్ నిర్వహించడం జరిగింది.
ప్రస్తుతం సైబర్ నేరాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ గారు, సైబర్ వారియర్స్, దర్యాప్తు అధికారులు మరియు ఎస్‌హెచ్‌ఓల సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (TGCSB) డైరెక్టర్ శిఖా గోయల్, ఐపీఎస్ గారి సూచనలు, మార్గదర్శకాల మేరకు సైబర్ నేరాల దర్యాప్తులో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించడం, బాధితులకు త్వరితగతిన న్యాయం అందించడం, ఆన్‌లైన్ ఆర్థిక మోసాల్లో పోయిన నగదును వీలైనంత త్వరగా రికవరీ చేయడానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని వివరించారు. శిక్షణలో ముఖ్యంగా ఈ అంశాలపై సమగ్ర అవగాహన కల్పించారు:
- Grievance Redressal Module
- Money Restoration Module
- Samanvaya Portal
- NCRP (FIR / Closure) Complaints
- కేసులపై సత్వర చర్యలు తీసుకొని అర్హత గల కేసుల్లో వెంటనే FIRలు నమోదు చేయడం.
- సైబర్ నేరాల దర్యాప్తులో సమన్వయ పోర్టల్‌ను సమర్థవంతంగా వినియోగించడం.

ఈ కార్యక్రమంలో సైబర్ క్రైమ్ డీఎస్పీ గిరికుమార్, సైబర్ క్రైమ్ సబ్ ఇన్‌స్పెక్టర్ శ్రావణ్ కుమార్, ఐటీ సెల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రవి, జిల్లాలోని సైబర్ వారియర్స్ ప్రత్యక్షంగా పాల్గొనగా, అన్ని పోలీస్ స్టేషన్‌ల ఎస్‌హెచ్‌ఓలు మరియు సంబంధిత అధికారులు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ మాట్లాడుతూ, సైబర్ నేరాల పట్ల ప్రతి పోలీసు అధికారి అప్రమత్తంగా ఉండాలని, బాధితుల ఫిర్యాదులపై తక్షణ స్పందనతో చర్యలు తీసుకోవాలని, పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రజలు తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, మెసేజ్‌లు, లింకులు, నకిలీ పెట్టుబడి, ట్రేడింగ్, పార్ట్‌టైమ్ ఉద్యోగాలు, KYC అప్‌డేట్, ఋణాలు, బ్యాంక్ వివరాలు అడిగే మోసగాళ్లను నమ్మవద్దని సూచించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైన వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలని లేదా www.cybercrime.gov.in ద్వారా వెంటనే ఫిర్యాదు నమోదు చేయాలని ప్రజలకు జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# ఎస్ ఐ ఆర్ ప్రక్రియను పరిశీలించిన జిల్లా కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, జులై 7 (నేటి దర్శిని బ్యూరో):**
ఎస్ ఐ ఆర్ ప్రక్రియను మార్గదర్శకాల ప్రకారం పారదర్శకంగా, నిష్పాక్షికంగా ఓటర్ అనుమతితో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బి ఎల్ ఓ లకు సూచించారు. వరంగల్ జిల్లా నర్సంపేట మండలంలో ఓటర్ ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఇంటింటి సర్వే, ఓటర్ వివరాల నమోదు, ధ్రువీకరణ ప్రక్రియను పరిశీలించి, బి ఎల్ ఓ ల పనితీరుపై ఆరా తీశారు. అర్హులైన ప్రతి ఓటర్ ను గుర్తించి, జాబితా సవరణ పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ప్రారంభానికి సిద్ధమైన ములుగు నూతన కలెక్టరేట్ భవనం ...!



**ఉమ్మడి వరంగల్, జూలై 7 (నేటి దర్శిని బ్యూరో):**
ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలోని ములుగు జిల్లా నూతన సమీకృత కలెక్టరేట్ భవన సముదాయ నిర్మాణం పూర్తికావొచ్చింది. 63. 5 కోట్ల వ్యయముతో నాలుగు ఏళ్ల కిందట భవన సముదాయ పనులను మొదలుపెట్టి నేటికీ పూర్తి చేయడం జరిగింది. 20వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో భవన నిర్మాణం ఏర్పాటు చేశారు. దీనితోపాటు 8.5 కోట్లతో కలెక్టర్, జిల్లా అధికారుల నివాస భవనాలు నిర్మించారు. త్వరలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

# హెల్మెట్ ధరించండి.. ప్రాణాలను కాపాడుకోండి

- **వాహనదారులకు అవగాహన కల్పించిన ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు**



**ఆమనగల్లు, జూలై 7, (నేటి దర్శిని) :**
రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ద్విచక్ర వాహనదారుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆమనగల్లు పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు సూచించారు. మంగళవారం ఆమనగల్లు పట్టణంలోని జాతీయ రహదారిపై ప్రత్యేక వాహన తనిఖీలు నిర్వహించిన ఆయన, హెల్మెట్ ధరించకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులను గుర్తించి చలాన్లు విధించారు. అనంతరం వారికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ, హెల్మెట్ ధరించకపోవడం వల్ల జరిగే ప్రమాదాలు, వాటి తీవ్రతను వివరించారు.
రోడ్డు ప్రమాదాల్లో ప్రాణనష్టం ఎక్కువగా తలకు తీవ్ర గాయాలు కావడం వల్లే జరుగుతుందని, నాణ్యమైన హెల్మెట్ ధరించడం ద్వారా ప్రాణాలను రక్షించుకోవచ్చని తెలిపారు. అలాగే వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని, అతివేగం, నిర్లక్ష్య డ్రైవింగ్, మద్యం సేవించి వాహనాలు నడపడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. "మన భద్రత మన చేతుల్లోనే ఉంది. మనం ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, ఇతరులకు కూడా వాటి ప్రాముఖ్యతను తెలియజేస్తేనే రోడ్డు ప్రమాదాలను తగ్గించగలం. ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలకు అండగా ఉండేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి" అని ఎస్‌హెచ్‌ఓ వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ఆమనగల్లు పరిధిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు ఇలాంటి ప్రత్యేక తనిఖీలు, అవగాహన కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని

# టెక్స్ టైల్ పార్క్ భూనిర్వాసిత యువతకు ఉద్యోగ అవకాశాలు: కలెక్టర్



**ఉమ్మడి వరంగల్, జూలై 7 (నేటి దర్శిని బ్యూరో):**
వరంగల్ జిల్లా పరిధిలోని శాయంపేట ,గీసుకొండ మండలాల్లో మెగా టెక్స్టైల్ పార్కు కోసం భూములు కోల్పోయిన నిర్వాసిత యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారదా తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ 18 - 35 ఏళ్ల మధ్య వయసు గల అర్హులైన యువత బయోడేటా ,ఆధార్ కార్డు, విద్య ధ్రువపత్రాలతో కలెక్టరేట్ లోని ప్రజావాణి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇందులో ఎంపికైన వారికి జిందాల్ ,డి ఆర్ డి ఓ లాంటి సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు ఉంటాయని తెలిపారు.

# మహిళల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే కేఆర్ నాగరాజ్

- **ఇందిరమ్మ చీరలను పంపిణీ చేసిన ఎమ్మెల్యే**





**ఉమ్మడి వరంగల్, జులై 7 ( నేటి దర్శిని బ్యూరో):**
మహిళల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుఅన్నారు. మంగళవారం వరంగల్ నగరంలోని 44,45,46,64 డివిజన్లోని మహిళలకి శ్రీ రాజా రాజేశ్వర ఫంక్షన్ హాల్లో మహిళలకు ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించామని తెలిపారు. మహిళలను కోటీశ్వరులు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. మహిళల సంక్షేమం, ఆర్థిక స్వావలంబన, సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. మహిళల పట్ల గౌరవం, మన సంస్కృతి మరియు సంప్రదాయాల పట్ల ఆదరణకు ప్రతీకగా ఇందిరా మహిళా శక్తి చీరలు అందజేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళల అభ్యున్నతి కోసం చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మెన్ అజీజ్ ఖాన్,45వ డివిజన్ అధ్యక్షులు కర్ర హరీష్ రెడ్డి,44వ డివిజన్ అధ్యక్షులు జక్కుల సదానందం,46వ డివిజన్ అధ్యక్షులు వస్కుల శ్రీను,64వ డివిజన్ అధ్యక్షులు దువ్వ శ్రీకాంత్,మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి,మహిళ అధ్యక్షురాలు రజినీ,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు జ్యోతి,డివిజన్ల ముఖ్య నాయకులు,మాజీ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు,అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో ఇంకా ఎంతమంది చావాలి!

- **ముఖ్యమంత్రికి టిపిఎస్పీటిఎ ప్రశ్న**
- **విశ్రాంత ఉపాధ్యాయుడు పగిడిపల్లి పుల్లయ్య మృతి విచారకరం**
- **తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టిఎస్పీటిఎ) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రి రామలింగం, కే.మనోహర్ రెడ్డి**



**హైదరాబాద్,జూన్07(నేటి దర్శిని):**
తెలంగాణ రాష్ట్రంలో గడిచిన నాలుగు సంవత్సరాలుగా పదవీ విరమణ ప్రయోజనాలు చెల్లించడంలో జరుగుతున్న అసంబద్ధ ఆలస్యం వల్ల అనేక మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు ప్రాణాలు కోల్పోయారని, వేలాది మంది పలు సమస్యల్ని ఎదుర్కొంటున్నారని, ఆ కోవలోనే జనగామ పట్టణ విశ్రాంత ఉపాధ్యాయుడు పగిడిపల్లి పుల్లయ్య ఆత్మహత్య చేసుకున్నారని, ఆయనను ఈ పరిపాలన వ్యవస్థ హత్య చేసిందని చెప్పడం సమంజసంగా ఉంటుందని తెలంగాణ స్టేట్ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (టిఎస్పీటిఎ) రంగారెడ్డి జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నర్రి రామలింగం, కే.మనోహర్ రెడ్డిలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం మీడియా విడుదల చేసిన ఒక ప్రకటనలో వారు మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణలో భాగంగా తమకు రావాల్సిన బకాయిల కోసం ఇంకా ఎంతమంది చావాలో రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేయాలని వారు కోరారు. రాష్ట్రంలోని పలు ఉచిత పథకాలకు లక్షల కోట్లు ఖర్చు చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం చట్ట బద్ధంగా రావలసిన పదవీ విరమణ ప్రయోజనాలను చెల్లించడానికి నిధులు లేవని చెప్పడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. వృద్ధాప్యంలో మనుగడకు పదవి విరమణ ప్రయోజనాలే ఉపాధ్యాయులకు దిక్కని, వాటిని చెల్లించడానికి నిధుల లేమి కేవలం ఒక సాకు మాత్రమేనని వారు ఆరోపించారు. ఉపాధ్యాయులకు చెందిన మొత్తం పెండింగ్ బకాయిలను ఉచిత పథకాలతో సంబంధం లేకుండా ఏక మొత్తంగా చెల్లించి ఆత్మ "హత్య" లను నివారించాలని వారు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. పగిడిపల్లి పుల్లయ్య ఆత్మహత్యను దృష్టిలో ఉంచుకొని తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టు పెండింగ్ లో ఉన్న బకాయిల కేసుల్లో రాజ్యాంగపరమైన చర్యలు తీసుకోవాలని, పౌరులకు జీవించే హక్కును ప్రసాదించిన ఆర్టికల్ 21కు భంగం కలగకుండా చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ అంశంపై తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే ప్రత్యక్ష ఆందోళన దిగుతామని వారు హెచ్చరించారు.

# సంపాదకీయం

## బకాయిలు భారమా?



విద్యార్థులకు ఇవ్వాల్సిన స్కాలర్‌షిప్‌లను నెలల తరబడి పెండింగ్‌లో పెట్టి, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయకుండా చదువునే సంక్ష?ోభంలోకి నెట్టేస్తూ, మరోవైపు లక్ష?ల ఉద్యోగాలు ఇస్తామని హామీలివ్వడం, జాబ్‌క్యాలెండర్ ద్వారా ఖాళీలను భర్తీచేస్తామనడం ఎంతవరకు విశ్వసనీయం? చదువుతున్న యువతకు కనీస భరోసా కల్పించలేని పాలన, చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం కల్పిస్తామనడం నమ్మశక్యమేనా? ఎందుకంటే, రాష్ట్రంలో గత కొంతకాలంగా స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తీవ్రమైన సమస్యగా మారాయి. విద్యార్థులు, కళాశాలల యాజమాన్యాలు పలుమార్లు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన ఫలితం లేదు. ఈ సమస్య గల్లీ నిరసనల నుంచి న్యాయస్థానాల వరకు వెళ్లడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. పెండింగ్ బకాయిల విడుదల కోసం విద్యార్థి సంఘాలు ఇటీవల అన్ని జిల్లాల్లో ఆందోళనలు చేపట్టగా పోలీస్ యంత్రాంగం వాటిని అణగదొక్కేందుకు చూసింది. కొంతమంది అరెస్టు, మరికొంత మందిని బైండోవర్ కూడా చేసింది. అయితే విద్యార్థుల ఉద్యమాన్ని అడ్డుకోవడంలో ఉన్న చిత్తశుద్ధి బకాయిలు చెల్లించడంలో లేకపోవడం ఇక్కడ విచారించాల్సిన అంశం.స్కాలర్‌షిప్ అనగానే పాలకులు దాన్ని పెద్ద ఆర్థిక గుదిబండలా చూడటమే అసలు సమస్య. పేద విద్యార్థికి స్కాలర్‌షిప్ అనేది దానం కాదు, అది రాజ్యాంగ బద్ధమైన సామాజిక బాధ్యత. ఫీజు రీయింబర్స్‌మెంట్ కూడా సంక్ష?ేమ పథకం కాదు, ఉన్నత విద్యకు ఆర్థిక అడ్డంకులు తొలగించే సాధనం. వాటిలో జాప్యమంటే వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తును అనిశ్చితిలోకి నెట్టడమే అవుతుంది. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్ షిప్‌ల జాప్యంపై తెలంగాణ హైకోర్టు పలుమార్లు ప్రభుత్వాన్ని వివరణ కోరింది. విద్యార్థుల ధ్రువపత్రాలను నిలిపి వేయరాదని, సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. అయినప్పటికీ సర్కార్ నిర్లక్ష్యపు ధోరణితోనే వ్యవహరిస్తోంది. స్కాలర్‌షిప్ అందకపోతే దాని ప్రభావం కేవలం ఒక విద్యార్థిపైనే ఉండదు, ఒక కుటుంబం మొత్తం ఆర్థిక ఒత్తిడికి గురవుతుంది. తల్లిదండ్రులు అప్పులు చేసి ఫీజులు చెల్లించాల్సి వస్తుంది. చాలామంది విద్యార్థులు చదువు మధ్య లోనే నిలిపివేయాల్సిన పరిస్థితి ఏర్పడు తుంది. ఉద్యోగ అవకాశాలు కోల్పోతారు. పేదరికం నుంచి బయటపడే మార్గమే మూసుకు పోతుంది. ప్రభుత్వం సంక్షేమం గురించి ఎంత గొప్పగా చెప్పుకున్నా, విద్యార్థులకు ఇవ్వాల్సిన చట్టబద్ధమైన ఆర్థిక సహాయాన్ని సకాలంలో అందించలేకపోతే ఆ మాటలకు విలువుండదు. విద్యపై పెట్టే ఖర్చును వ్యయంగా కాకుండా భవిష్యత్తుపై పెట్టు బడిగా చూడాలి. కానీ నిధుల విడుదలలో జాప్యం, పరిపాలనా నిర్లక్ష్యం, స్పష్టమైన కార్యాచరణ లేకపోవడం వల్ల ప్రతి ఏడాది ఇదే సమస్య పునరావృ తమవుతోంది. ఈ సమస్యలో మరో బాధా కరమైన అంశం కళాశాలల పరిస్థితి. ప్రభుత్వ బకాయిలు రాకపోవడంతో కొన్ని విద్యాసంస్థలు ఆర్థిక ఇబ్బం దులు ఎదుర్కోవడం వాస్తవం. స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయంబర్స్ మెంట్ దాదాపు రూ. పదిహేను వందల కోట్లు పెండింగ్‌లో ఉన్నట్టు యాజమాన్యాలు చెబుతున్నాయి. చెల్లించాలని ఎన్ని వినతులు చేసినా, కళాశాలలు మూసేస్తామని హెచ్చరించినా సర్కార్ పెడచెవిన పెట్టడంతో అంశం కోర్టుదాకా వెళ్లింది. 'ఆర్థిక సమస్యలు న్నాయి. ఒకేసారి చెల్లించడం కష్టం. కొద్దికొద్దిగా ఇస్తాం' అంటూ సర్కార్ కాలయాపన చేస్తోంది. దాని ప్రభావం నేరుగా విద్యార్థులపై పడుతోంది. 'సర్కార్ ఫీజు చెల్లించడం లేదని, మీరే అది చెల్లించాలని' యాజ మాన్యాలపై నుంచి ఒత్తిడి పెరుగుతోంది. పైగా కోర్టు కూడా విద్యార్థుల నుంచి వసూలు చేసుకోవచ్చని చెప్పడం సమస్యను జటిలం చేసినట్టు విద్యార్థి సంఘాల విమర్శ! ప్రభుత్వ నిర్లక్ష్యపు వైఖరికి విద్యార్థులను బలిచేయడం ఎంత తప్పో, అదేవిధంగా యాజమాన్యాల ఆర్థిక ఇబ్బందులను విస్మరించడం కూడా సరైంది కాదు. కోర్టు కూడా రెండు పక్ష?ాల హక్కులను సమతుల్యం చేయాల్సిన బాధ్యత ఉంటుంది. కానీ, ఈ మొత్తం సంక్ష?ోభానికి మూల కారణం ప్రభుత్వం బకాయిలను విడుదల చేయకపోవడం. ప్రస్తుతం ప్రభుత్వం ఉద్యోగాల భర్తీ, యువతకు ఉపాధి, అభివృద్ధి వంటి హామీలను ఇస్తోంది. అవన్నీ స్వాగ తించదగినవే. కానీ ఇప్పటికే చదువుతున్న విద్యార్థులకు బకాయిలు సకాలంలో చెల్లించలేని ప్రభుత్వం, రేపు లక్షలాది నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పినప్పుడు యువతలో సహజంగానే సందేహాలు తలెత్తుతాయి. అందువల్ల వెంటనే పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల న్నింటినీ విడుదల చేయాలి. యాజమాన్యాలు కోర్టుల చుట్టూ, విద్యార్థులు నిరసనల బాటలో తిరగాల్సిన పరిస్థితి రాకూడదు. పేద విద్యార్థి చదువు ఆగకుండా చూడటం ఏ ప్రభుత్వానికైనా మొదటి బాధ్యత. దాన్ని నిర్వర్తించినప్పుడే ఉద్యోగాల హామీలు, అభివృద్ధి వాగ్దానాలు ప్రజల్లో విశ్వాసాన్ని పొందగలవు.

# డాన్స్ బార్ల అనుమతిపై కీలక నిర్ణయం..

### కొత్త చట్టం తీసుకొస్తున్న మహారాష్ట్ర ప్రభుత్వం



**న్యూఢిల్లీ -07 జూలై (నేటి దర్శిని)**
మహారాష్ట్రలోని ముంబై సహా అనేక ప్రధాన పట్టణాల్లో బార్లలో డ్యాన్సులు చేయడం మామూలే. అయితే, ఈ విషయంలో నిబంధనలు ఉల్లంఘిస్తున్నారు నిర్వాహకులు. ఈ తరహా చట్టవ్యతిరేక కార్యకలాపాల్ని అడ్డుకునేందుకు మహారాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. డాన్స్ బార్ల నిర్వహణపై కొత్త చట్టం తీసుకువస్తోంది. ఈ మేరకు మహారాష్ట్ర అసెంబ్లీలో 'మహారాష్ట్ర ప్రొహిబిషన్ ఆఫ్ ఆబ్సెన్స్ డాన్స్ ఇన్ హోటల్స్, రెస్టారెంట్స్ అండ్ బార్ రూమ్స్ అండ్ ప్రొటెక్షన్ ఆఫ్ డిగ్నిటీ ఆఫ్ ఉమన్ (వర్కింగ్ దేర్ ఇన్) యాక్ట్, 2016 పేరుతో బిల్లును ప్రవేశపెట్టింది.బార్లకు అనుమతించే విషయంలో ఇప్పటివరకు ఉన్న మహారాష్ట్ర పోలీస్ యాక్ట్ స్థానంలో కొత్త బిల్లు ప్రవేశపెట్టారు. ఈ బిల్లును రాష్ట్ర హోం శాఖ (రూరల్) మంత్రి పంకజ్ భోయర్ సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ప్రకారం ఇకపై హోటళ్లు, రెస్టారెంట్లు, బార్లలో మహిళల డాన్స్‌పై కఠినమైన నిబంధనలు అమలవుతాయి. ఇప్పటికే డ్యాన్స్ బార్ల నిర్వహణపై మహారాష్ట్రలో కఠిన చట్టాలు అమలులో ఉన్నాయి. అయితే, వాటిలోని లోపాలను అడ్డం పెట్టుకుని బార్లు, రెస్టారెంట్లు, హోటళ్లలో మహిళలతో డాన్స్ చేయిస్తున్నారు. నిజానికి ఈ తరహా డాన్సులపై, ఆర్కెస్ట్రా, మ్యూజిక్ ప్రోగ్రాంలపై మహారాష్ట్రలో నిషేధం ఉంది. కానీ, చట్టంలోని ఒక లోపాన్ని అడ్డుపెట్టుకుని పర్మిషన్ తీసుకుని బార్లు నడిపిస్తున్నారు. మహారాష్ట్ర సెక్షన్ 33 ప్రకారం.. పబ్లిక్‌లో డాన్సులు చేసేందుకు, ఆర్కెస్ట్రా, మ్యూజిక్ వినియోగించేందుకు స్థానిక పోలీస్ కమిషనర్లు, జిల్లా మెజిస్ట్రేట్‌లు లైసెన్సులు జారీ చేయవచ్చు. దీంతో స్థానికంగా పబ్లిక్‌లో ఇలా డాన్స్‌కు అనుమతి పొంది బార్లు, హోటళ్లలో మహిళలతో డాన్స్ చేయిస్తున్నారు. సాధారణ డాన్స్ ప్రదర్శనలకు అనుమతిపొంది, వీటిని బార్లలో అసభ్యకర డాన్సులుగా మారుస్తున్నారు. అందుకే, ఇలాంటి వాటిని అడ్డుకునేందుకు దేవేంద్ర ఫడ్నవీస్ ఆధ్వర్యంలోని మహారాష్ట్ర ప్రభుత్వం కొత్తచట్టం తీసుకొస్తోంది. దీని ప్రకారం.. ఆర్కెస్ట్రా, లైవ్ మ్యూజిక్ పేరుతో అనుమతి పొంది డాన్స్ బార్లు నిర్వహించడం కుదరదు. కొత్త చట్టాలకు అనుగుణంగా ఉంటేనే అనుమతిస్తారు. లైసెన్సులు, నిర్వహణ, భద్రత, మహిళల రక్షణకు ఈ కొత్త చట్టం మరింతగా ఉపయోగపడుతుందని ప్రభుత్వం చెబుతోంది. ఈ బిల్లు అసెంబ్లీలో ఆమోదం పొందాల్సి ఉంది.

# జంటగా ట్రెకింగ్‌కు వెళ్తున్నారా..

## కేతన్ హత్య తర్వాత జాగ్రత్తగా ఉంటున్న మగాళ్లు..



**న్యూఢిల్లీ -07 జూలై (నేటి దర్శిని)**
ఇటీవల పూనేలో జరిగిన కేతన్ అగర్వాల్ హత్య ఎంతటి సంచలనం సృష్టించిందో తెలిసిందే. కాబోయే భర్తను విహారానికి తీసుకెళ్లిన అతడి కాబోయే భార్య సియా గోయల్.. అతడిని పర్వతంపైనుంచి తోసేసి చంపేసింది. అంతకుముందు కూడా సోనమ్ అనే మహిళ తన భర్తను ఇలాగే మేఘాలయలోని పర్వత ప్రాంతానికి తీసుకెళ్లి హత్య చేయించింది. దీంతో ఇటీవలి కాలంలో భార్యతోనో, ప్రేయసితోనో పర్వత ప్రాంతాలకు టూర్ వెళ్లాలంటేనే మగాళ్లు భయపడుతున్నారు. దీనికి సంబంధించి సోషల్ మీడియాలో మీమ్స్ పేలిపోతున్నాయి.పలు ఫన్నీ వీడియోలు సర్క్యులేట్ అవుతున్నాయి. ఈ అంశం మీదే ఇన్‌ఫ్లుయెన్సర్లు బోలెడన్ని వీడియోస్ తీస్తున్నారు. ఈ సీరియస్ అంశాన్ని కొందరు కామెడీ కూడా చేస్తున్నారు. ఏదేమైనా ఇలాంటి చోట్లకు జంటగా వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలనే విషయాన్ని మగాళ్లు సీరియస్‌గా తీసుకుంటున్నారు. కావాలంటే ఈ వీడియో చూడండి. ఈ వీడియో ఎక్కడ తీశారో వివరాలు తెలియదు. కానీ, ప్రస్తుతం ఈ వీడియో వైరల్ అవుతోంది. దీని ప్రకారం.. ఒక జంట పర్వత ప్రాంతానికి ట్రెకింగ్‌కు వెళ్లింది. అయితే, ఇటీవలి పూనే హత్య నేపథ్యంలో ఆ భర్త తన రక్షణ కోసం ఒక కీలక నిర్ణయం తీసుకున్నారు. తన భార్య చేతిని, తన చేతిని ఒక దుపట్టా (చున్నీ)తో కట్టి ఉంచాడు. ఎక్కడైనా తన భార్య తనను పర్వతం పైనుంచి తోసేయకుండా ఉండేందుకు ఇలా తన భార్యతో కలిసి దుపట్టా కట్టుకున్నట్లు భర్త చెప్పాడు.దీనివల్ల ఆ భార్య అతడిని తోసేయలేదు. ఒకవేళ అలా చేసినా, ఆమె కూడా అతడితోపాటే లోయలో పడిపోతుంది. అందుకే ఇప్పుడు ఇద్దరూ సేఫ్. భర్త వల్ల భార్యకు.. భార్య వల్ల భర్తకు ఎలాంటి హానీ ఉండదు. ఈ వీడియోలో కనిపిస్తున్న జంట.. అలా దుపట్టా ఇద్దరి చేతులకు కట్టుకునే పర్వాతారోహణ చేశారు. వీరిద్దరినీ ఒక వ్యక్తి వీడియో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయగా ఇప్పుడు వైరల్ అవుతోంది. జంటగా పర్వతాలపైకి వెళ్లినప్పుడు ఈ ఐడియా ఏదో పాటిస్తే బాగుంటుంది అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు.

# 32 కేజీల బంగారం, 1518 కేజీల వెండి..

## కానుకలన్నీ సురక్షితం: ట్రస్టు ట్రెజరర్



**న్యూఢిల్లీ -07 జూలై (నేటి దర్శిని)**
శ్రీ రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ కీలక ప్రకటన చేసింది. తమ ట్రస్టు ఆధీనంలో సుమారు 30 కిలోల బంగారు ఐటమ్స్ ఉన్నట్లు తెలిపింది. సుమారు 1518 కేజీల వెండి వస్తువులు ఉన్నట్లు ఆ ట్రస్టు ట్రెజరర్ స్వామి గోవింద దేవ్ గిరి తెలిపారు. అయోధ్య రామాలయంలో విరాళాలను చోరీ చేసిన ఘటనలో 8 మంది అరెస్టు అయిన విషయం తెలిసిందే. ఆ కేసులో ఇంకా దర్యాప్తు జరుగుతున్నది. అయితే భక్తులు సమర్పించిన విరాళాలను చోరీ చేసినట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో రామజన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు ఇవాళ స్పందించింది. దేవాలయానికి ఇప్పటి వరకు 2926 విలువైన వస్తువులను కానుకలుగా సమర్పించారని, అవన్నీ సురక్షితంగా ఉన్నాయని, వాటికి సంబంధించిన రికార్డులను కూడా మెయిన్‌టేన్ చేస్తున్నట్లు ఆయన చెప్పారు.బంగారంతో తయారు చేసిన రామచరితమానస్, డైమండ్ నెక్లెస్ కూడా అదృశ్యమైనట్లు వచ్చిన వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను మీడియా ముందు ప్రదర్శించింది. స్వామివారికి చెందిన వెండి చరణ పాదుకలు, కాకభుషండి కళాకృతి మిస్సైనట్లు సోషల్ మీడియాలో వ్యాపిస్తున్న వార్తలను ట్రస్టు కొట్టిపారేసింది. ఆ కానుకలను కూడా మీడియా ముందు ట్రస్టు ప్రదర్శించింది. ప్రతి వస్తువు వివరాలను ఇన్వెంటరీలో పొందుపరిచామని, ఆ వస్తువును విరాళం ఇచ్చిన దాత పేరు కూడా తమ వద్ద ఉన్నట్లు గిరి తెలిపారు.వెండి కాకభుషండి వస్తువు ఆలయ ఆధీనంలో ఉన్నట్లు గిరి చెప్పారు. 2024 మార్చి 31వ తేదీ వరకు రామమందిరానికి సుమారు 16.765 కిలోల బంగారు వస్తువులు కానుకలుగా వచ్చినట్లు ఆయన తెలిపారు. ఇక 2024–25లో 10.445 కిలోల బంగారం, 2025–26లో 5.050 కిలోల బంగారం కానుకల రూపంలో వచ్చిందన్నారు. 2026 మార్చి 31వ తేదీ వరకు ఆలయానికి మొత్తం 32. 259 కిలోల బంగారం అందినట్లు గిరి వెల్లడించారు. వెండి వస్తువులను కరిగించిన తర్వాత ఆలయం వద్ద మొత్తం 849 కేజీల రిఫైన్డ్ సిల్వర్ ఉన్నట్లు ఆయన చెప్పారు. ఇక ఈ ఏడాది మార్చి 31 వరకు మొత్తం 1518 కిలోల వెండి ఆలయం వద్ద ఉన్నట్లు ఆయన తెలిపారు. ప్రతి ఏడాది చార్టెడ్ అకౌంట్‌తో ఆ వస్తువులను వెరిఫై చేయిస్తున్నట్లు గిరి తెలిపారు.

# పాప్ సింగర్‌పై ఆస్ట్రేలియా ప్రధాని అనుచిత వ్యాఖ్యలు..

### విమర్శలు వెల్లువెత్తడంతో క్షమాపణలు



**న్యూఢిల్లీ -07 జూలై (నేటి దర్శిని)**
ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఒక కామెడీ పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో ప్రముఖ పాప్ సింగర్ కైలీ మినోగ్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఆ దేశ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపాయి. ప్రధాని హోదాలో ఉండి మహిళలను కించపరిచేలా, పదవికి ఉన్న గౌరవాన్ని తగ్గించేలా మాట్లాడారంటూ ప్రతిపక్ష నేతలు, స్వతంత్ర ఎంపీలు, మహిళా సంఘాలు ఆయనపై విరుచుకుపడ్డాయి. దేశవ్యాప్తంగా నిరసనలు మిన్నంటడంతో అల్బనీస్ బహిరంగంగా క్షమాపణలు చెప్పారు.తన వ్యాఖ్యలపట్ల తీవ్ర విచారం వ్యక్తంచేస్తూ ఎవరినైనా నొప్పించి ఉంటే బేషరతుగా క్షమాపణలు కోరుతున్నట్లు ఆయన కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. జూలై 2న విడుదలైన కమెడియన్ నిక్కీ ఓస్బోర్న్ 'బుష్ డీప్' పాడ్‌కాస్ట్‌లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోస్ట్ ఓస్బోర్న్.. ఆస్ట్రేలియాకు చెందిన ముగ్గురు ప్రముఖ మహిళలు (కైలీ మినోగ్, నటి నికోల్ కిడ్మాన్, ఎంటర్‌టైనర్ రోండా బర్చ్‌మోర్) పేర్లను ప్రస్తావిస్తూ "ఎవరిని పెళ్లి చేసుకుంటారు..? ఎవరితో డేటింగ్ చేస్తారు..? ఎవరితో శృంగారం చేస్తారు..?" అని ప్రశ్నించారు. మొదట తన భార్య జోడీ హేడన్‌ను గుర్తుచేస్తూ అల్బనీస్ ఈ ప్రశ్నను దాటవేయాలని చూసినప్పటికీ హోస్ట్ పదే పదే ఒత్తిడి చేయడంతో పాప్ సింగర్ కైలీ మినోగ్ పేరును ఎంచుకున్నారు. ఆ ముగ్గురిలో కైలీతోనే పెళ్లి, డేటింగ్, శృంగారం అన్నీనా? అని హోస్ట్ అడుగగా.. "అన్నీ ఆమెతోనే. ఆమె అద్భుతమైన మహిళ" అని ప్రధాని సమాధానమిచ్చారు. అంతేకాకుండా మీ భార్యతో లైంగిక జీవితం ఎలా ఉందంటూ ఆస్ట్రేలియన్ స్లాంగ్ ఉపయోగించి హోస్ట్ అడిగిన మరో ప్రశ్నకు ప్రధాని నవ్వుతూ.. "సమయం దొరికినప్పుడు బానే ఉంటుంది" అని చెప్పారు. అదేవిధంగా తనకు ఇష్టమైన రగ్బీ టీమ్ గెలిస్తే అది మంచి సెక్స్ ప్రేరకంలా పనిచేస్తుందని వ్యాఖ్యానించారు. నవంబర్ 2025లో జోడీ హేడన్‌ను వివాహం చేసుకుని పదవిలో ఉండగానే పెళ్లి చేసుకున్న మొదటి ఆస్ట్రేలియా ప్రధానిగా రికార్డు సృష్టించిన అల్బనీస్.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. 'కమ్యూనిటీ స్ట్రాంగ్ ఆస్ట్రేలియా' పార్టీకి చెందిన జాలీ స్టెగల్ స్పందిస్తూ.. ప్రధాని స్థానంలో ఉన్న వ్యక్తి ఇలాంటి దిగజారుడు ఆటల్లో పాల్గొనకూడదని, ఆ ప్రశ్నలను అక్కడికక్కడే ఖండించి ఆదర్శంగా నిలవాల్సింది పోయి శ్రుతిమించారని మండిపడ్డారు. ప్రతిపక్ష సెనేటర్ సారా హెండర్సన్ మాట్లాడుతూ.. మద్యం మత్తులో మాట్లాడినట్టు ఉన్న ప్రధాని వ్యాఖ్యలు మహిళలను అవమానించేలా ఉన్నాయని, ఆస్ట్రేలియన్లు సిగ్గుపడేలా చేశాయని మండిపడ్డారు. మరో సెనేటర్ మరియా కోవాసిక్ కూడా దీనిని తీవ్రమైన విచక్షణారాహిత్యంగా అభివర్ణించారు. అయితే పాలక లేబర్ పార్టీకి చెందిన డిప్యూటీ పీఎం రిచర్డ్ మార్లెస్, మంత్రి టానియా ప్లిబెర్సెక్‌లు ప్రధానికి మద్దతుగా నిలిచారు. ప్రధానికి దేశంలోని ఒక ప్రముఖ సెలబ్రిటీపై ఉన్న అభిమానంతో అన్న మాటలే తప్ప, ఎవరినీ అవమానించే ఉద్దేశం కాదని వారు సమర్థించారు. కాగా ఈ వివాదంపై పాప్ స్టార్ కైలీ మినోగ్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు

# సర్ లో వేగం పెంచండి.. గడువులోగా పూర్తి చేయండి

**గోడకొండ్ల పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన దేవరకొండ ఆర్డీఓ**
**ఫారాల సేకరణ, డిజిటలైజేషన్‌పై బీఎల్‌వోలకు కీలక ఆదేశాలు**



**చింతపల్లి, జూలై 7 (నేటి దర్శిని):** ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (Special Intensive Revision--SIR) కార్యక్రమాన్ని వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని దేవరకొండ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీఓ) అధికారులను ఆదేశించారు. సోమవారం చింతపల్లి మండలంలోని గోడకొండ్ల గ్రామం పోలింగ్ స్టేషన్ నెం.2ను ఆమె ఆకస్మికంగా సందర్శించి, ఎన్యూమరేషన్ ఫారాల సేకరణ, డిజిటలైజేషన్ పనుల పురోగతిని క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు), బీఎల్‌వో సూపర్‌వైజర్లతో మాట్లాడిన ఆర్డీఓ, రోజువారీ పురోగతిని గణనీయంగా పెంచాలని స్పష్టం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్రతి అర్హ ఓటరికి ఎన్యూమరేషన్ ఫారాలను అందజేసి, పూర్తిగా నింపించుకుని వెంటనే డిజిటలైజేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు.ఎన్నికల సంఘం నిర్దేశించిన గడువులోగా సేకరణ, డిజిటలైజేషన్ పనులు పూర్తి చేయడంతో పాటు ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ఖచ్చితత్వంతో పని చేయాలని ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదులో పారదర్శకత, నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు.ఈ తనిఖీలో ఎమ్మార్వో విజయలక్ష్మి సంబంధిత రెవెన్యూ అధికారులు, ఎన్నికల సిబ్బంది, బీఎల్‌వోలు, బీఎల్‌వో సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# ఘనంగా మంద కృష్ణ మాదిగ జన్మదిన వేడుకలో పాల్గొన్న

● **టైగర్ జంగయ్య మాదిగ**




**మిడ్జిల్, జులై 07, (నేటి దర్శిని ప్రతినిధి):** పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆశయాలను ఆచరణలో పెట్టి ఎస్సీ వర్గీకరణ ఫలాలు ప్రతి మాదిగ కుటుంబానికి అందేలా కృషి చేయాలని ఎంఆర్‌పీఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి టైగర్ జంగయ్య మాదిగ అన్నారు. ఎంఆర్‌పీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు పడిగాళ్ల సురేష్ మాదిగ ఆధ్వర్యంలో మిడ్జిల్ మండల కేంద్రంలోని అంబేద్కర్ భవనం వద్ద ఎంఆర్‌పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ 62వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టైగర్ జంగయ్య మాదిగ దండోరా జెండాను ఆవిష్కరించి, అనంతరం కేక్ కట్ చేశారు. మాట్లాడుతూ మంద కృష్ణ మాదిగ నాయకత్వంలో సాధించిన ఎస్సీ ఏబీసీడీ వర్గీకరణ ఫలాలను ప్రతి అర్హ కుటుంబం సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. సామాజిక న్యాయం కోసం మంద కృష్ణ మాదిగ చేసిన ఉద్యమం చిరస్మరణీయమని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వీజుఖీ రాష్ట్ర కోఆర్డినేటర్ గాలి యాదయ్య మాదిగ, ఎంఆర్‌పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి వినోద్ మాదిగ, జిల్లా కార్యదర్శి శివ మాదిగ, సీనియర్ నాయకులు గుడ్ల బాలయ్య, బుచ్చయ్య, భీమ్‌రాజు, గణేష్, బరిగెల సురేష్, కావలి వెంకటయ్య, రవీంద్ర, జహీర్, ఆంజనేయులు, లప్పీ, అల్లాజీ, రాము, మండల నాయకులు, అంబేద్కర్ సంఘం సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నేటి నుండి ఫారం ఫిల్లింగ్ మేళ

● **మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి**




**ఆమనగల్లు,జులై07(నేటి దర్శిని):** ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ 2026 ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. జూన్ 25 నుండి ప్రారంభమైన ఈ డ్రైవ్ లో మునిసిపాలిటీలోని మొత్తం 16,967 మంది ఓటర్లలో ఇప్పటివరకు 85% మందికి ఏన్యుమరేషన్ పారాలను బూతు స్థాయి అధికారులు విజయవంతంగా పంపిణీ చేశారు.ఫారాలు అందుకున్న ఓటర్లందరూ వాటిని వెంటనే తమ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఉన్న బిఎల్ఓ లకు సమర్పించాలని సహాయక ఓటర్ల నమోదు అధికారి ఏఈఆర్ఓ కోరారు.నేటి నుండే ఫారం ఫిల్లింగ్ మేళ ఫారాలు నింపడంలో ఓటర్లకు సహాయం చేయడానికి ఆయా పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకంగా"ఫారం ఫిల్లింగ్ మేళా" నిర్వహించబడుతుంది. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ను కూడా ఓటర్లు సంప్రదించి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ రాఘవేందర్ రెడ్డి కోరారు.

# జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్-2026-27 ముగింపు కార్యక్రమం







●**పాల్గొన్న జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్**
**విజేతలకు ప్రశంసా పత్రాల ప్రదానం**

**మిడ్జిల్, జులై 07, (నేటి దర్శిని మహబూబ్ న గర్ జిల్లా బ్యూరో):** జోగులాంబ జోన్--VII డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్, ఐపీఎస్ గారి ఆదేశాల మేరకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో రెండు రోజుల పాటు నిర్వహించిన జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్--2026-27 ముగింపు కార్యక్రమం మంగళవారం జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించబడింది. ఈ జోనల్ లెవల్ పోలీస్ డ్యూటీ మీట్‌లో జోన్--VII పరిధిలోని ఐదు జిల్లాలకు చెందిన పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని Scientific Aids to Investigation, Anti-Sabotage Check, Computer Knowledge, Dog Squad, Photography & Videography తదితర విభాగాల్లో తమ ప్రతిభను ప్రదర్శించారు. ముగింపు కార్యక్రమంలో వివిధ విభాగాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ ప్రశంసా పత్రాలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జోనల్ స్థాయిలో విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోలీస్ డ్యూటీ మీట్‌కు ఎంపికైన అధికారులు, సిబ్బంది అదే పట్టుదలతో రాష్ట్రస్థాయిలో కూడా ప్రతిభ కనబరిచి జోన్-VII కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇటువంటి డ్యూటీ మీట్‌లు పోలీసు సిబ్బందిలో వృత్తి నైపుణ్యాలు, సాంకేతిక పరిజ్ఞానం, దర్యాప్తు సామర్థ్యాలను మరింత మెరుగుపరచడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి జోన్ గౌరవాన్ని మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లాలని విజేతలకు సూచించారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బీ రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, భూత్పూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణతో పాటు వివిధ జిల్లాలకు చెందిన అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇసుక మాఫియాపై రాజీ లేదు..

●అక్రమాలకు పాల్పడితే ఎవరినీ వదిలిపెట్టం
●నా కుటుంబంపై నిరాధార ఆరోపణలు మానుకోవాలి..ఇసుక మాఫియాను అరికట్టడంలో ప్రభుత్వం కట్టుదిట్టం
●తప్పుడు ప్రచారాలపై చట్టపరమైన చర్యలు తప్పవు
●గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వంలోనే ఇసుక అక్రమాలపై అత్యధిక కేసులు
●రాజకీయ లబ్ధి కోసం అసత్య ప్రచారాలు చేయొద్దు.. నా ఇమేజ్ డ్యామేజ్ చేసే వారిపై కఠిన చర్యలు
●ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రచారాలు మానాలి.. అక్రమార్కులపై కఠిన చర్యలు కొనసాగుతాయి:ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి



**మిడ్జిల్,జూలై 07, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** జడ్చర్ల నియోజకవర్గంలో ఇసుక అక్రమ రవాణాపై రాష్ట్ర ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, గత పదేళ్లతో పోలిస్తే ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే అత్యధిక కేసులు నమోదు చేసి అక్రమాలపై ఉక్కుపాదం మోపినట్లు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి స్పష్టం చేశారు.
ఇటీవల రాత్రి సమయంలో అక్రమంగా ఇసుక తరలింపుపై సమాచారం అందడంతో పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని పరిశీలించి, చట్టపరమైన చర్యలు చేపట్టారని తెలిపారు. అక్రమాలకు పాల్పడే వారెవరైనా చట్టం ముందు సమానమేనని, ఎలాంటి రాజకీయ లేదా వ్యక్తిగత ఒత్తిళ్లకు తావులేకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని పేర్కొన్నారు.ఈ సందర్భంగా తన కుటుంబ సభ్యులపై జరుగుతున్న అసత్య ప్రచారాలను ఎమ్మెల్యే తీవ్రంగా ఖండించారు. "మా కుటుంబ సభ్యులు ఎవరూ అక్రమ కార్యకలాపాలకు పాల్పడరు. ఒకవేళ ఎవరైనా చట్టవిరుద్ధంగా వ్యవహరిస్తే వారిపై కూడా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని నేనే అధికారులను కోరుతాను. అక్రమాలకు ఎలాంటి మద్దతు ఉండదు" అని స్పష్టం చేశారు.
జడ్చర్ల నియోజకవర్గంలోని దుందుభి వాగులతో పాటు ఇతర వాగుల్లో ప్రస్తుతం ఇసుక అందుబాటులో లేకపోవడానికి గత పదేళ్లలో జరిగిన విచ్చలవిడి అక్రమ తవ్వకాలే కారణమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వానికి ఎంత ఆదాయం వచ్చింది, ఎన్ని కేసులు నమోదయ్యాయో లెక్కలు పరిశీలించాలని, తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం, నమోదైన కేసుల వివరాలను కూడా ప్రజల ముందుంచాలని సూచించారు.తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో ఇసుక మాఫియా ఆగడాలను అరికట్టేందుకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని, అక్రమాల నియంత్రణలో ప్రభుత్వం విజయవంతమైందని తెలిపారు.కొంతమంది వ్యక్తులు కావాలనే తన రాజకీయ ప్రతిష్ఠను దెబ్బతీయాలనే ఉద్దేశంతో తన కుటుంబ సభ్యులను ఇసుక మాఫియాతో ముడిపెడుతూ అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఎమ్మెల్యే మండిపడ్డారు. ఇలాంటి దుష్ప్రచారాలు, నిరాధార ఆరోపణలు కొనసాగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు ఎవరినీ ఉపేక్షించేది లేదని హెచ్చరించారు.ప్రజలు వాస్తవాలను మాత్రమే విశ్వసించాలని, తప్పుడు ప్రచారాలను నమ్మి అపోహలకు గురికావద్దని ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# ఆదర్శ మున్సిపాలిటీగా దేవరకొండ..అభివృద్ధే లక్ష్యం

●ఎమ్మెల్యే బాలు నాయక్
●రూ.80 లక్షలతో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన
●ప్రతి వార్డులో దశలవారీగా మౌలిక వసతుల కల్పనకు హామీ




**దేవరకొండ, జూలై 7 (నేటి దర్శిని):** దేవరకొండ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ అన్నారు. పట్టణంలోని 7వ వార్డులో మణికంఠ ట్రేడర్స్ నుంచి తాటికోల్ రోడ్డు వరకు రూ.80 లక్షల పట్టణ అభివృద్ధి నిధులతో నిర్మించనున్న నూతన సీసీ రోడ్డు పనులకు మంగళవారం ఆయన ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి శంకుస్థాపన చేశారు.
ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పించడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. పట్టణ అభివృద్ధిలో భాగంగా రహదారులు, డ్రైనేజీలు, తాగునీటి సౌకర్యం, విద్యుత్ వంటి మౌలిక వసతుల విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. దేవరకొండ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడానికి ప్రతి వార్డులో అవసరమైన పనులను దశలవారీగా చేపడుతున్నామని, ప్రజల అవసరాలకు అనుగుణంగా మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తామని ఎమ్మెల్యే బాలు నాయక్ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆలంపల్లి నరసింహ, స్థానిక కౌన్సిలర్ హన్మంత్ సాయిచంద్ర గౌడ్, మున్సిపల్ కమిషనర్ రామదుర్గారెడ్డి, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మారుపాకుల సురేష్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు రైస్, నాయకులు హన్మంత్ వెంకటేష్ గౌడ్, ఏర్పుల గోవిందు, కరుణాకర్, పట్టణ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.



# అనుమతులు లేని కోళ్ల ఫారాన్ని వెంటనే తొలగించాలి

- దుర్వాసన, ఈగలతో ప్రజలు ఇబ్బందులు
- జర్పుల తండా గ్రామస్థుల ధర్నా.. తహసీల్దార్‌కు వినతిపత్రం

**చింతపల్లి, జూలై 7 (నేటి దర్శిని):** చింతపల్లి మండలం జర్పుల తండా శివారులో ప్రభుత్వ, గ్రామపంచాయతీ అనుమతులు లేకుండా ఏర్పాటు చేసినట్లు ఆరోపిస్తున్న కోళ్ల ఫారాన్ని వెంటనే తొలగించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. కోళ్ల ఫారం నుంచి వస్తున్న దుర్వాసన, ఈగల బెడదతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ మంగళవారం కోళ్ల ఫారం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రామస్థులు మాట్లాడుతూ కోళ్ల



ఫారం కారణంగా గ్రామంలో నివసించడం దుర్భరంగా మారిందన్నారు. దుర్వాసనతో ఇళ్లలో ఉండలేకపోతున్నామని, భోజనం చేయడానికే ఇబ్బందిగా మారిందని తెలిపారు. ఈగల బెడద అధికమై చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.గ్రామ శివారులో ఇలాంటి కోళ్ల ఫారం నిర్వహించడం వల్ల ప్రజారోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని పేర్కొంటూ, సంబంధిత శాఖలు వెంటనే విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న కోళ్ల ఫారాన్ని వెంటనే తొలగించి శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం గ్రామస్థులు చింతపల్లి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించి, కోళ్ల ఫారం ఏర్పాటుకు అవసరమైన అనుమతులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో జర్పుల తండాకు చెందిన గిరిజన గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మిడ్జిల్ మండల నూతన ఎంపీడీవోగా లక్ష్మణ్ రాథోడ్ బాధ్యతల స్వీకరణ



**మిడ్జిల్ జులై 07,( నేటి దర్శిని ప్రతినిధి ):** మిడ్జిల్ మండల నూతన మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా లక్ష్మణ్ రాథోడ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ మండలంలో ఎంపీవోగా విధులు నిర్వహించిన ఆయన, పదోన్నతి పొందుతూ మిడ్జిల్ మండలానికి నియమితులయ్యారు.
ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసి స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మణ్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధికారులు, సిబ్బంది సమన్వయంతో మండల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని పేర్కొన్నారు.

# హాస్టల్ భవన నిర్మాణ పనులను పరిశీలించిన

- ఏఎంసి మాజీ వైస్ చైర్మన్ గుర్రం కేశవులు



**ఆమనగల్లు,జులై07(నేటి దర్శిని):** రంగారెడ్డి జిల్లా ఆమనగల్లు పట్టణంలో నూతనంగా నిర్మిస్తున్న బీసీ బాలుర హాస్టల్ భవన నిర్మాణ పనులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు పరిశీలించారు. శిథిలావస్థకు చేరిన బీసీ బాలుర హాస్టల్ భవనాన్ని కూల్చి నూతనంగా అరబిందో ఫార్మా కంపెనీ సిఎస్ఆర్ నిధులు రూ: నాలుగు కోట్లతో నూతన భవనం నిర్మిస్తున్నారు. నూతన భవన నిర్మాణం మొదటి అంతస్తు స్లాబ్ పనులను ఆమనగల్లు మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్, మాజీ సర్పంచ్ గుర్రం కేశవులు జరుగుతున్న పనులను పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో డిసిసి కార్యదర్శి మానయ్య,శ్రీను నాయక్, జగన్,కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్ పోస్టర్లను ఆవిష్కరించిన జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్

**మిడ్జిల్, జులై 07, (నేటి దర్శిని మహబూబ్ నగర్ జిల్లా బ్యూరో):** మహబూబ్‌నగర్ జిల్లా పోలీసు కార్యాలయంలో ఆపరేషన్ ముస్కాన్--12 కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపిఎస్ ఆవిష్కరించారు.
ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, జూలై 1 నుండి జూలై 31 వరకు నిర్వహిస్తున్న “ఆపరేషన్ ముస్కాన్--12” కార్యక్రమం ద్వారా 18 సంవత్సరాల లోపు బాలబాలికలను గుర్తించి, బాల కార్మిక వ్యవస్థ, బాల్య వివాహాలు, బాలల అక్రమ రవాణా, బలవంతపు భిక్షాటన, గృహ పనులు మరియు ఇతర ప్రమాదకర పనుల్లో నిమగ్నమై ఉన్న పిల్లలను రక్షించి, తిరిగి విద్యా సంస్థల్లో చేర్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు.18 సంవత్సరాల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టవిరుద్ధమని, అటువంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి చిన్నారి విద్యను అభ్యసించే హక్కును కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని, బాల కార్మికులను ఎక్కడైనా గుర్తించినా వెంటనే



పోలీసు శాఖ, చైల్డ్‌లైన్ లేదా సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సమాజంలోని ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వాములై బాలల భవిష్యత్తును కాపాడేందుకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎన్.బీ.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ రమణ రెడ్డి, సీడబ్ల్యూసీ ఛైర్మన్ నయీముద్దీన్, కార్మిక శాఖ అధికారులు, మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ అధికారులు, పోలీసు అధికారులు మరియు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బలోపేతానికి అందరూ కలిసికట్టుగా కృషి చేయాలి

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



**ఆమనగల్లు,జులై07(నేటి దర్శిని):** కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతినిధులు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆమనగల్లు, తలకొండపల్లి,మాడుగుల, కడ్తాల్,మండలాల నూతన అధ్యక్షులుగా ఎన్నికైన నాయకులను ఆయన తన నివాసంలో వారిని శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందించి శుభాకాంక్షలను తెలియజేశారు.ఈ సందర్భంగా ఆయా మండలాల మాజీ అధ్యక్షులను కూడా సత్కరించి,పార్టీకి వారు చేసిన సేవలను కొనియాడారు.జిల్లా కాంగ్రెస్ కమిటీ కార్యవర్గ సభ్యులు రఘురాములు, శ్రీనివాస్ రెడ్డి,మానయ్య, చేగూరి వెంకటేష్ లను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను కార్యకర్తలు గడపగడపకు తీసుకెళ్లి విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గుర్రంపోడులో ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం

- మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు

**గుర్రంపోడు, జూలై 7 (నేటి దర్శిని):** నల్గొండ జిల్లా గుర్రంపోడు మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) 32వ ఆవిర్భావ దినోత్సవంతో పాటు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గుర్రంపోడు మండల అధ్యక్షుడు కొమ్ము రమేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, నాయకులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండాను కొమ్ము రమేష్ ఆవిష్కరించారు. అనంతరం మందకృష్ణ మాదిగ జన్మదినాన్ని పురస్కరించుకుని కేక్



కట్ చేసి, ఒకరికొకరు మిఠాయిలు పంచుకుంటూ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కొమ్ము రమేష్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ, మాదిగల హక్కుల పరిరక్షణతో పాటు ఎస్సీ వర్గీకరణ సాధన కోసం మందకృష్ణ మాదిగ మూడు దశాబ్దాలకు పైగా సాగించిన ఉద్యమం చారిత్రాత్మకమని పేర్కొన్నారు. ఆయన ఆశయాల సాధనకు ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేస్తూ ఎమ్మార్పీఎస్‌ను మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు రేపాక నరసింహ, సీనియర్ నాయకులు మారపాక గిరి, దున ఈదయ్య, మేడి సైదులు, మేడి వెంకన్న, రేపాక లక్ష్మీపతి, రేపాక సాయిలు, మేడి లాలు, ఆడెపు ఎల్లయ్య, మారపాక లింగయ్య, పోలేని మనోజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరిత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.

# తెలుగు విశ్వవిద్యాలయంలో ఆరో రోజు రిలే నిరాహార దీక్షలు

**హైదరాబాద్: (జులై 07) (నేటి దర్శిని):** తెలుగు విశ్వవిద్యాలయ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో నాంపల్లి క్యాంపస్ లో కొనసాగుతున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం ఆరో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులు వినూత్న నిరసన కార్యక్రమాలు నిర్వహించారు.”వీసీ డౌన్ డౌన్”, “రిజిస్ట్రార్ డౌన్ డౌన్” అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.అనంతరం వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లతో సమావేశమైన విద్యార్థులు తమ డిమాండ్లను వివరించారు. ముఖ్యంగా, ఆద్యకళ పేరుతో ప్రస్తుతం విశ్వవిద్యాలయంలో ఉంచిన జయధీర్ తిరుమలరావు వ్యక్తిగత వస్తువులను వెంటనే తొలగించాలని కోరారు.విద్యార్థుల ఆందోళనపై స్పందించిన వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్‌లు పరిపాలనా అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించి అన్ని అంశాలపై చర్చించి త్వరలోనే అధికారిక నిర్ణయాన్ని వెల్లడిస్తామని హామీ ఇచ్చారు.అయితే, తమ డిమాండ్లు నెరవేరే వరకు ఉద్యమాన్ని మరింత ఉద్ధృతంగా కొనసాగిస్తామని విద్యార్థులు స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో ఏబీవీపీ ఆల్ ఇండియా స్టేట్ యూనివర్సిటీస్ కో-కన్వీనర్ కమల్ సురేష్, రాష్ట్ర యూనివర్సిటీస్ కో-కన్వీనర్ గంధం నరేందర్, విద్యార్థి నాయకులు హరీష్, గోపాల్, రాహుల్, నర్సప్ప, గోపాల్, ప్రొఫెసర్లు సత్యనారాయణ, శ్రీనివాస్, వెంకటేష్, సుజాత, జయశ్రీ,తదితరులు పాల్గొన్నారు.

## వివేక్ మణియార్ జన్మదినం సందర్భంగా అనాథ చిన్నారులకు అల్పాహార సేవశ్రీ కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం





**ఎల్.బి.నగర్, జూలై 7 (నేటి దర్శిని):** కృష్ణ గోపాల్ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం వివేక్ మణియార్ జన్మదినాన్ని పురస్కరించుకుని అనాథ చిన్నారుల పాఠశాలలో ఉదయం అల్పాహార సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణ గోపాల్ సేవా సమితి సభ్యులు చిన్నారులతో కలిసి జన్మదిన వేడుకలను నిర్వహించి, కేక్ కట్ చేసి వారి ఆనందంలో భాగస్వాములయ్యారు. అనంతరం చిన్నారులకు పరిశుభ్రమైన, రుచికరమైన అల్పాహారాన్ని అందించి వారి ముఖాల్లో చిరునవ్వులు నింపారు. "మానవ సేవే మాధవ సేవ" అనే మహోన్నత లక్ష్యంతో కృష్ణ గోపాల్ సేవా సమితి నిరంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సమాజంలో సేవాభావాన్ని చాటుకుంటోందని సమితి సభ్యులు తెలిపారు. ఈ సందర్భంగా వివేక్ మణియార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ, భగవంతుడు వారికి ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించి, సమాజ సేవలో మరింత ముందుకు సాగే శక్తి, సంకల్పాన్ని అనుగ్రహించాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ మోడల్ స్కూల్‌లో స్పాట్ అడ్మిషన్లు ప్రారంభం



**గుర్రంపోడు, జూలై 7 (నేటి దర్శిని):** గుర్రంపోడు మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ అండ్ జూనియర్ కళాశాలలో 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించి స్పాట్ అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి జి. రాగిణి తెలిపారు. పాఠశాల విభాగంలో 6వ తరగతి నుంచి 10వ తరగతి వరకు, అలాగే ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలోని ఎంపీసీ (MPC), బైపీసీ (BiPC), సీఈసీ (CEC), ఏఈసీ (AEC) గ్రూపుల్లో ఖాళీగా ఉన్న సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. విద్యార్థులకు ఉచితంగా యూనిఫారాలు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్ అందజేయడంతో పాటు, 8వ మరియు 9వ తరగతి విద్యార్థులకు ఎన్‌సీసీ శిక్షణ, అత్యాధునిక ఐసీటీ (ICT) ల్యాబ్, అటల్ టింకరింగ్ ల్యాబ్ వంటి సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు.అదేవిధంగా ఐటీ (IT/ITES), హెల్త్‌కేర్ వంటి వృత్తి విద్యా కోర్సుల్లో ప్రత్యేక శిక్షణతో పాటు విద్యార్థుల సమగ్ర వికాసం కోసం యోగా, సంగీతం, కరాటే తరగతులు కూడా నిర్వహిస్తున్నట్లు వివరించారు. సీట్లు పరిమితంగా ఉన్నందున ఆసక్తి గల తల్లిదండ్రులు వెంటనే పాఠశాల యాజమాన్యాన్ని సంప్రదించి ప్రవేశాలు పొందాలని ప్రిన్సిపాల్ రాగిణి విజ్ఞప్తి చేశారు. మరిన్ని వివరాల కోసం 93973 20844 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

## గుర్తుతెలియని వాహనం ఢీకొని వలస కూలీ మృతి

### ఇంటికి వెళ్లేందుకు బయలుదేరిన యువకుడి విషాదాంతం





**చింతపల్లి, జూలై 7 (నేటి దర్శిని):** చింతపల్లి మండల కేంద్రంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టడంతో ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ వలస కూలీ అక్కడికక్కడే మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన లక్ష్మణ్ ఖగియా, ఆనంద్ ఖగియా, సుశీల్ మిర్ధా (18)లు ఉపాధి కోసం ఇటీవల చింతపల్లి పరిధిలోని ఓరుగంటి బాబురావుకు చెందిన ఆర్‌బీఎస్ ఇటుక బట్టీలో పనికి వచ్చారు. అయితే సుశీల్ మిర్ధా గత కొద్దిరోజులుగా "అమ్మ గుర్తొస్తోంది.. ఇంటికి వెళ్లిపోతాను" అంటూ తన స్వగ్రామానికి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.ఈ నెల 6వ తేదీ సోమవారం రాత్రి సుమారు 11 గంటల సమయంలో తన బట్టల బ్యాగు తీసుకుని ఇటుక బట్టీ నుంచి బయలుదేరి బస్సు ఎక్కేందుకు చింతపల్లి గ్రామం వైపు నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అతనికి తల, ముఖానికి తీవ్ర గాయాలు కావడంతో ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. సమాచారం అందుకున్న మృతుడి మేనమామ లక్ష్మణ్ ఖగియా ఘటనాస్థలానికి చేరుకుని పంచనామా అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు చింతపల్లి ఎస్ఐ ముత్యాల రామమూర్తి తెలిపారు.

# అణగారిన వర్గాల గొంతుక మందకృష్ణ మాదిగ

- -ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ
- -మూడు దశాబ్దాల పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ
- -ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నరసింహ మాదిగ
- -ఘనంగా ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం



**రంగారెడ్డి జిల్లా జూలై 07 (నేటి దర్శిని):** షాద్‌నగర్: ఎమ్మార్పీఎస్ 32వ ఆవిర్భావ దినోత్సవం, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను పురస్కరించుకుని షాద్‌నగర్ నియోజకవర్గ కేంద్రంలో జిల్లా అధ్యక్షుడు పెంటనోల్ల నరసింహ మాదిగ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బాణాసంచా పేల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, రంగారెడ్డి జిల్లా ఇంచార్జి రాగళ్ల ఉపేందర్ మాదిగ ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. ఆధునిక భారతదేశంలో అణగారిన వర్గాల గొంతుకగా మందకృష్ణ మాదిగ నిలిచారని, మూడు దశాబ్దాలుగా రాజీలేని ఉద్యమాన్ని నడిపి ఎస్సీ వర్గీకరణ సాధనలో చారిత్రాత్మక విజయాన్ని అందించారని అన్నారు. ఎమ్మార్పీఎస్ ఉద్యమం కేవలం మాదిగలకే పరిమితం కాకుండా సమాజంలోని అన్ని అణగారిన వర్గాల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడిందని పేర్కొన్నారు. గుండె జబ్బులతో బాధపడుతున్న చిన్నారులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స, వృద్ధులు, వికలాంగులు, వితంతువుల పెన్షన్లు, రేషన్ బియ్యం పెంపు, ఎస్సీ--ఎస్టీ ఉద్యోగుల ప్రమోషన్లలో రిజర్వేషన్లు, తెలంగాణ అమరవీరుల కుటుంబాల సంక్షేమం, మహిళలపై నేరాల నివారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటు వంటి అనేక ప్రజా సమస్యలపై ఉద్యమించి ఫలితాలు సాధించిందని తెలిపారు. ఎస్సీ వర్గీకరణ ద్వారా లభించిన అవకాశాలను యువత సద్వినియోగం చేసుకోవాలని, విద్య, విజ్ఞానం, పోటీ పరీక్షలపై దృష్టి సారించి అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని, మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పీడిత వర్గాల ఐక్యతతో అసమానతలు లేని సమాజ నిర్మాణం కోసం ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఫరూఖ్‌నగర్ అధ్యక్షుడు జోగు నాగభూషణం మాదిగ, నియోజకవర్గ నాయకులు బొబ్బిలిగామ పాండు మాదిగ, నాగర్‌కుంట మహేందర్ మాదిగ, కల్లపల్లి బాలరాజు మాదిగ, జనిగే శ్రీశైలం మాదిగ, ఎంఎస్‌ఎఫ్ జిల్లా నాయకులు ఎర్ర సురేష్ మాదిగ, దక్కలి హక్కుల పోరాట సమితి నాయకులు రత్నం దక్కలి, డాకూరి సుజాత దక్కలి, సంగం నరహరి మాదిగ, సంగం శ్రీను మాదిగ, రవి మాదిగ, అడ్వకేట్ లింగారం లక్ష్మయ్య, వీహెచ్‌పీఎస్ నాయకులు మల్లేష్, వెంకటేష్, మహిళలు, విద్యార్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఆడిషనల్ కలెక్టర్ కే శ్రీనివాస్ (లోకల్ బాడీస్) ఉత్తర్వులను బేఖాతరు చేసిన షాద్ నగర్ మునిసిపల్ కమిషనర్

- మున్సిపల్ కమిషనర్ కు వ్యతిరేకంగా మునిసిపల్ కార్యాలయం వద్ద జాతీయ జెండాతో నిరసనకు దిగిన ఆర్ఎన్ రాము.



**రంగారెడ్డి జిల్లా జూలై 07 (నేటి దర్శిని):** షాద్ నగర్ చౌరస్తాలో నిత్యం ప్రమాదాలు జరుగుతూనే ఉన్నాయి, అనేక మంది మృత్యు వాత పడిన ఘటనలు అనేకం. ఈ ప్రమాదాలను చూసి చలించి పోయిన షాద్ నగర్ పట్టణ వాసి ఆర్ఎన్ రాము చౌరస్తా ను విస్తీర్ణ చేసి ప్రజల ప్రాణాలుకాపాడమని ఒక్కడే వంటరిగా పోరాటం చేస్తున్నాడు. అన్ని శాఖల అధికారుల ను , ప్రజా ప్రతినిధులను కలిసి వినతి పత్రాలు అందజేశారు. అందులో భాగంగానే ఫిబ్రవరి 10, 2026 నాడు రంగారెడ్డి జిల్లా అడిషనల్ కలెక్టర్ కే శ్రీనివాస్ (లోకల్ బాడీస్) షాద్ నగర్ మునిసిపల్ కమిషనర్ కు లేక రాసినట్లు చౌరస్తా ఉద్యమ కారుడు ఆర్ఎన్ రాము తెలిపారు. ఆ లేఖలో గత అనేక సంవత్సరాలుగా చౌరస్తాలో ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రాణాలు కోల్పోయారని తెలుపుతూ.. పరిగి నుండి షాద్ నగర్ వరకు రోడ్ విస్తరణకు 554.00 లక్షల రూపాయలు మంజూరు అయినట్లుగా రంగారెడ్డి జిల్లా ఆర్ అండ్ బి ఈఈ తెలిపారని , తక్షణమే షాద్ నగర్ లో రోడ్ ను ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. కానీ ఆనాటి నుండి నేటి వరకు సుమారు 5 నెలలు గడుస్తున్నా మునిసిపల్ కమిషనర్ ఎలాంటి చర్యలు తీసుకోక పోవడం, అడిగిన ప్రతీసారి చూస్తున్న అనే సమాధానం ఇస్తూ కాలయాపన చేస్తునారని ఆర్ఎన్ రాము ఆరోపించారు. కమిషనర్ కు ప్రజల ప్రాణాలంటే విలువ లేదని, కనీసం పై అధికారులు చెప్పింది కూడా చేయకుండా రాజకీయ నాయకులకు అనుకూలంగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనికి నిరసనగా మునిసిపల్ కమిషనర్ కార్యాలయం వద్ద జాతీయ జెండాతో నిరసన తెలిపినట్లు ఆర్ఎన్ రాము తెలిపారు. ప్రజలకు ఉపయోగం లేని కమిషనర్ మనకు అవసరమా అంటూ ప్రశ్నించారు.

## నా పేరుతో నకిలీ ఫిర్యాదు చేశారు మాజీ సర్పంచ్ గోపాల్ గౌడ్ ఆవేదన

- నకిలీ సంతకంతో ఫోర్జరీ చేసిన దుండగులు



**వికారాబాద్ (నేటి దర్శిని):జులై 07** హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి జూన్ 8, 2026న తన పేరు, నకిలీ సంతకంతో అపరిచిత వ్యక్తులు అక్రమంగా ఒక ఫిర్యాదును సమర్పించారని వికారాబాద్ జిల్లా, నవాబ్‌పేట్ మండలం, అక్నాపూర్ గ్రామం మాజీ సర్పంచ్ జి. గోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ ఫిర్యాదుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తన అనుమతి లేకుండా, పరువు ప్రతిష్ఠలకు భంగం కలిగించేలా తన గుర్తింపును దుర్వినియోగం చేస్తూ ఈ నకిలీ పత్రాన్ని సృష్టించారని పేర్కొన్నారు. ఈ ఫోర్జరీ వ్యవహారంపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ ఇప్పటికే నవాబ్‌పేట్ పోలీస్ స్టేషన్‌లో, ఎక్సైజ్ శాఖ అధికారులకు అధికారికంగా ఫిర్యాదు చేసినట్లు వెల్లడించారు. భవిష్యత్తులో తన పేరుతో వచ్చే ఎలాంటి లేఖలు లేదా ఫిర్యాదులనైనా నమ్మే ముందు వాటి నిజానిజాలను పూర్తిగా ధృవీకరించుకోవాలని ప్రజలకు, ప్రభుత్వ అధికారులకు, మీడియాకు విజ్ఞప్తి చేశారు.

## నవాబుపేట మండల సర్పంచిల సంఘం అధ్యక్ష ఎన్నిక

- నవాబుపేట్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కొండల్ యాదవ్



**వికారాబాద్ (నేటి దర్శిని):జులై 7** నూతన సర్పంచ్ లు, మండల నూతన సర్పంచ్‌ల ఆత్మీయ సమావేశం ఘనంగా జరిగింది. ఈ సమావేశంలో మండల సర్పంచ్ లు సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడిగా కావలి కొండయ్య యాదవ్,మరియు కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండలంలోని నూతన సర్పంచ్‌లందరూ కలిసికట్టుగా కావలి కొండయ్య యాదవ్ నాయకత్వాన్ని బలపరుస్తూ ఈ నిర్ణయం తీసుకున్నారు.

నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌ల మధ్య సమన్వయం పెంచడం, మండల పరిధిలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం అందరూ కలిసికట్టుగా పనిచేసేలా కార్యాచరణ రూపొందించుకోవడం ఈ ఆత్మీయ సమావేశం యొక్క ముఖ్య ఉద్దేశం.తనను సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుణ్ణిగా ఎన్నుకున్నందుకు కొండయ్య యాదవ్ తోటి సర్పంచ్‌లకు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అందరినీ కలుపుకుంటూ మండల అభివృద్ధికి శ్రమిస్తానని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు.

# జైలర్ 2 బిజినెస్‌కు భారీ క్రేజ్..

## - రిలీజ్‌కు ముందే మలయాళంలో రికార్డు డిమాండ్



సూపర్ స్టార్ రజినీకాంత్ నటించిన 'జైలర్' సినిమా బాక్సాఫీస్ వద్ద సృష్టించిన సంచలనం గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పనిలేదు. దర్శకుడు నెల్సన్ దిలీప్‌కుమార్ తెరకెక్కించిన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్ తమిళంతో పాటు తెలుగు, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లోనూ భారీ విజయాన్ని అందుకుంది. ముఖ్యంగా మలయాళ మార్కెట్‌లో ఈ చిత్రం అనూహ్యమైన వసూళ్లు సాధించి రజినీకాంత్ కెరీర్‌లోనే అత్యంత విజయవంతమైన చిత్రాల్లో ఒకటిగా నిలిచింది. ఇప్పుడు ఈ బ్లాక్‌బస్టర్‌కు సీక్వెల్‌గా రూపొందుతున్న జైలర్ 2 పై ఇప్పటికే భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇటీవల విడుదలైన రిలీజ్ డేట్ గ్లింప్స్ సినిమాపై ఉన్న హైప్‌ను మరింత పెంచింది. సోషల్ మీడియాలో ఆ వీడియోకు విశేష స్పందన లభించడంతో అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి.తాజా సమాచారం ప్రకారం, జైలర్ 2 విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సినిమా థియేట్రికల్ హక్కుల కోసం ఇప్పటికే మలయాళ మార్కెట్‌లో పోటీ మొదలైనట్లు తెలుస్తోంది. ముఖ్యంగా కేరళలో ప్రముఖ డిస్ట్రిబ్యూషన్ సంస్థలు ఈ సినిమా హక్కులను దక్కించుకోవడానికి ఆసక్తి చూపుతున్నాయని సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. మొదటి భాగం కేరళలో అద్భుతమైన వసూళ్లు సాధించడంతో పాటు, మలయాళ స్టార్ మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రలో కనిపించడం అక్కడి ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. దీంతో రెండో భాగంపై కూడా ట్రేడ్ వర్గాల్లో భారీ అంచనాలు ఏర్పడ్డాయి. 'జైలర్' తొలి భాగంలో మోహన్‌లాల్ ప్రత్యేక పాత్రకు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. అదే తరహాలో 'జైలర్ 2'లో కూడా ఆయన పాత్రకు ప్రాధాన్యత ఉంటుందనే ప్రచారం జరుగుతోంది. అయితే దీనిపై చిత్రబృందం ఇప్పటివరకు అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయలేదు. అయినప్పటికీ, రజినీకాంత్‌తో పాటు మోహన్‌లాల్ క్రేజ్ కూడా మలయాళ మార్కెట్‌లో సినిమాకు అదనపు బలం చేకూరుస్తుందనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది. ప్రస్తుతం వినిపిస్తున్న సమాచారం ప్రకారం, 'జైలర్ 2' థియేట్రికల్ బిజినెస్ ఊహించిన దానికంటే పెద్ద స్థాయిలో జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా దక్షిణాది మార్కెట్‌లో ఈ సినిమాకు భారీ డిమాండ్ ఉండటంతో పంపిణీ హక్కుల కోసం తీవ్ర పోటీ నెలకొనే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు. అయితే ఈ బిజినెస్‌కు సంబంధించిన వివరాలపై చిత్ర నిర్మాణ సంస్థ నుంచి ఇంకా అధికారిక ప్రకటన వెలువడలేదు.



## సెగలు పుట్టిస్తున్న దివ్య భారతి..

# క్వీన్ 2'కు భారీ షాక్..

## -రిలీజ్‌కు ముందే లీగల్ ట్రబుల్‌లో కంగనా సినిమా!



బాలీవుడ్ నటి కంగనా రనౌత్ కెరీర్‌లో ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన చిత్రాల్లో 'క్వీన్' ఒకటి. 2014లో విడుదలైన ఈ సినిమా విమర్శకుల ప్రశంసలతో పాటు భారీ విజయాన్ని కూడా అందుకుంది. ఇప్పుడు దాదాపు పదేళ్ల తర్వాత ఈ చిత్రానికి సీక్వెల్‌గా 'క్వీన్ 2' తెరకెక్కుతోంది. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉంది. అయితే విడుదలకు సిద్ధమవుతున్న ఈ సినిమాకు ఇప్పుడు ఊహించని లీగల్ సమస్య ఎదురైంది. క్వీన్ 2పై రూ.250 కోట్ల న్యాయపరమైన వివాదం నెలకొనడం బాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. తాజా నివేదికల ప్రకారం, ఫాంటమ్ స్టూడియోస్ ముంబై హైకోర్టులో జియోస్టార్‌పై రూ.250 కోట్ల దావా వేసింది. తమ అనుమతి లేకుండానే క్వీన్ 2 ను రూపొందించారని, ఇది అసలు సినిమా మేధో సంపత్తి హక్కులను ఉల్లంఘించడమేనని సంస్థ ఆరోపిస్తోంది.ఫాంటమ్ స్టూడియోస్ వాదన ప్రకారం, 'క్వీన్' చిత్రానికి సంబంధించిన మేధో సంపత్తి హక్కుల్లో తమకు 50 శాతం వాటా ఉందని, సీక్వెల్‌లు లేదా అనుబంధ చిత్రాలు నిర్మించాలంటే తమ అనుమతి తప్పనిసరిగా తీసుకోవాల్సి ఉంటుందని పేర్కొంది. 'క్వీన్ 2' నిర్మాణానికి సంబంధించి తమను ఎవరూ సంప్రదించలేదని, సీక్వెల్ నిర్మాణానికి తాము ఎలాంటి అనుమతులు ఇవ్వలేదని ఫాంటమ్ స్టూడియోస్ కోర్టుకు తెలిపినట్లు సమాచారం. ఈ కారణంగానే ఈ సినిమా తమ హక్కులను ఉల్లంఘిస్తోందని సంస్థ ఆరోపిస్తోంది. తాజా సమాచారం ప్రకారం, ఈ ఏడాది ఏప్రిల్‌లోనే ఫాంటమ్ స్టూడియోస్ ఈ వివాదంపై బహిరంగ ప్రకటన విడుదల చేసింది. అలాగే జియోస్టార్, దర్శకుడు వికాస్ బహల్‌తో పలుమార్లు చర్చలు జరిపి సమస్యను సామరస్యంగా పరిష్కరించేందుకు ప్రయత్నించినట్లు తెలుస్తోంది. అయితే ఆ చర్చలు ఫలించకపోవడంతో పాటు, 'క్వీన్ 2' షూటింగ్ పూర్తయిందని తెలిసిన తర్వాత సంస్థ కోర్టును ఆశ్రయించినట్లు బాలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుతం ఈ ఆరోపణలపై జియోస్టార్ అధికారికంగా స్పందించలేదు. అలాగే చిత్రబృందం కూడా ఈ వివాదంపై ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. ఈ నేపథ్యంలో కోర్టు విచారణ ఎలా సాగుతుంది? ఇరు పక్షాలు రాజీకి వస్తాయా? లేక న్యాయపోరాటం మరింత ముదురుతుందా? అన్నది ఆసక్తికరంగా మారింది.

# ఇలాంటి యాక్షన్ రాలేదు!



'అందరూ 'టాక్సిక్' రిలీజ్ ఇన్నిసార్లు ఎందుకు వాయిదా పడిందనే విషయం గురించి మాట్లాడుతున్నారు. కానీ సినిమా కంటెంట్ ఎంత కొత్తగా ఉందో ఆలోచించడం లేదు. ఇలాంటి సినిమాలు ఎప్పుడొచ్చినా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతినిస్తాయి' అని చెప్పింది కథానాయిక హ్యూమా ఖురేషి. యశ్ హీరోగా నటిస్తున్న 'టాక్సిక్' సినిమాలో ఆమె ఓ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే. గీతూ మోహన్ దాస్ దర్శకత్వం వహించిన ఈ సినిమా ఆగస్ట్ 26న ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే పలుమార్లు వాయిదా పడిన ఈ సినిమా ఎట్టకేలకు రిలీజ్ డేట్‌ను కన్‌ఫర్మ్ చేసుకుంది. ఈ సందర్భంగా ఇచ్చిన తాజా ఇంటర్వ్యూలో హ్యూమా ఖురేషి సినిమా విశేషాలను పంచుకుంది. ఈ చిత్రంలోని కొన్ని భాగాలను మాత్రమే తాను చూశానని, భారతీయ సినిమాలో ఈ స్థాయిలో యాక్షన్‌ను ఇప్పటివరకూ చూడలేదని ఆమె చెప్పింది. 'ఇలాంటి సినిమాలు ఎప్పుడు రిలీజైనా సంచలనం సృష్టించడం ఖాయం. కంటెంట్‌తో పాటు మేకింగ్, యాక్షన్ ఘట్టాలు ప్రేక్షకుల్ని అబ్బురపరుస్తాయి. కథలోని పాయింట్ కూడా ప్రేక్షకుల్ని ఆశ్చర్యపరుస్తుంది' అని హ్యూమా ఖురేషి తెలిపింది. కేవీఎన్ ప్రొడక్షన్స్ నిర్మించిన ఈ సినిమా వివిధ భారతీయ భాషల్లో భారీ స్థాయి లో విడుదలకు సిద్ధమవుతున్నది.

# సందీప్ రెడ్డి వంగా బ్యానర్‌లో 'రోమాంచకం'..

## ఆసక్తికరంగా ఫస్ట్ గ్లింప్స్



అర్జున్ రెడ్డి', 'యానిమల్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాలతో ఇండియన్ సినిమాను షేక్ చేసిన స్టార్ డైరెక్టర్ సందీప్ రెడ్డి వంగా సమర్పణలో ఒక సరికొత్త యూత్‌ఫుల్ లవ్ స్టోరీ రాబోతుంది. భద్రకాళి పిక్చర్స్ బ్యానర్‌పై ప్రణయ్ రెడ్డి వంగా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'రోమాంచకం' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఖరారు చేశారు. 'మేమ్ ఫేమస్' చిత్రంతో యూత్‌లో మంచి క్రేజ్ తెచ్చుకున్న యంగ్ హీరో సుమంత్ ప్రభాస్, '8 వసంతాలు' ఫేమ్ అనంతిక సనిల్ కుమార్ ఈ సినిమాలో లీడ్ రోల్స్ పోషిస్తున్నారు.నూతన దర్శకుడు వేణుగోపాల్ రెడ్డి రూపొందిస్తున్న ఈ క్రేజీ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక గ్లింప్స్‌ను మేకర్స్ తాజాగా విడుదల చేశారు. ప్రేమ, హాస్యం, ఉత్కంఠ అనే ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ గ్లింప్స్ ప్రస్తుతం ఆకట్టుకుంటోంది. ప్రారంభంలో సముద్ర తీరం బ్యాక్‌డ్రాప్‌లో హీరో హీరోయిన్ల మధ్య సాగే బైక్ రైడ్స్, రొమాంటిక్ సీన్స్ ఎంతో ఆహ్లాదకరంగా సాగగా.. అంతా ప్రశాంతంగా సాగుతుందనుకున్న తరుణంలో గ్లింప్స్ ముగింపులో దర్శకుడు ఒక ఊహించని మైండ్ బ్లోయింగ్ ట్విస్ట్ ఇచ్చారు. హీరో హీరోయిన్లు ఇద్దరూ ఒకరినొకరు గట్టిగా చెంపదెబ్బలు కొట్టుకుంటూ 'ఐ హేట్ యూ' అని అరుచుకోవడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అంతవరకు కూల్‌గా సాగిన వాతావరణం, ఒక్కసారిగా ఇంటెన్స్ ఎమోషనల్‌గా మారిపోవడంతో ఈ ప్రేమకథలో సందీప్ రెడ్డి వంగా మార్క్ గట్టిగానే ఉండబోతోందని స్పష్టమవుతోంది. ఇక వైవిధ్యమైన కంటెంట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్న ఈ యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రాన్ని సెప్టెంబర్ 3, 2026న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల చేయనున్నట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది.

# వెంకీ అట్లూరి దర్శకత్వంలో నాని ?



అగ్ర కథానాయకుడు నాని ప్రస్తుతం 'ది ప్యారడైజ్' షూట్‌లో బిజీగా ఉన్నారు. ఆ సినిమా షూటింగ్ ఆలస్యం కావడంతో నానితో సినిమా చేయాలనుకున్న దర్శకులంతా వేరే హీరోల బాట పడుతున్నట్టు వార్తలు వస్తున్నాయి. 'బ్లడీ రోమియో' కథను నానితో తీసేందుకు సిద్ధంగా ఉన్న సుజీత్ సైతం 'ది ప్యారడైజ్' లేట్ కారణంగానే 'ఓజీ 2'ను లైన్‌లో పెట్టే పనిలో పడ్డారని ఇన్‌సైడ్ టాక్. ఇదిలావుంటే.. నాని తాజాగా దర్శకుడు వెంకీ అట్లూరి కథకు ఓకే చెప్పారు. వీరిద్దరి మధ్య చాలాకాలంగా కథా చర్చలు జరుగుతూనే ఉన్నాయి. ఎట్టకేలకు వెంకీ రీసెంట్‌గా చెప్పిన కథ నానిని బాగా ఆకట్టుకున్నదట.దాంతో ఆయన పచ్చజెండా ఊపినట్టు విశ్వసనీయంగా తెలిసింది. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమా నిర్మిస్తారట. అందరూ అనుకుంటున్నట్టు దర్శకుడు సుజీత్ 'బ్లడీ రోమియో' కథను పక్కన పెట్టి 'ఓజీ 2'ను లైన్లోకి తెస్తే, 'ది ప్యారడైజ్' తర్వాత నాని చేసే సినిమా వెంకీ అట్లూరిదే అవుతుంది. ఒకవేళ సుజీత్ 'బ్లడీ రోమియో' సినిమానే ముందుకు తెస్తే, ఆ సినిమా పూర్తయ్యాక వెంకీ అట్లూరి సినిమా ఉంటుంది. ఏదేమైనా నాని లైనప్‌లో సరైన సినిమా వచ్చి చేరింది. దీనిపై అధికారిక ప్రకటన రావాల్సివుంది.

Published and Owned By Katta Hima Pavani Published at H.No:4-8-301/34SP, Sathya Nagar Colony, Hayath Nagar, Ranga Reddy, Telangana-501505. Printed at Smilys Online 6-7-48, Vanasthalipuram Shopping Complex, Ranga Reddy District, Telangana-500070, Editor: Katta Hima Pavani, PRGI NO: TGTEL/25/A0471, Phone: 94920 33365